# హిందూమత జాతీయవాద రాజకీయాలు

మొత్తం సమాజాన్ని తమ భావజాల ప్రభావంలోకి తెచ్చుకుని, రాజకీయాల్ని కూడా పూర్తిగా శాసించటానికి మతం మాత్రమే సరిపోదని సంఘ్ పరివార్ శక్తులు 20వ శతాబ్దపు ఆరంభంలోనే గ్రహించాయి. ఆధునిక కాలంలో మతం కంటే జాతి భావనకే ప్రజల్ని కదిలించగలిగే శక్తి అధికంగా వుంది. ఇస్లాం మతం మీద బెంగాలీజాతి అనే భావన పైచేయి సాధించటం మూలంగా బంగ్లాదేశ్ పాకిస్తాన్ నుండి విడిపోయింది. ఈ విషయాన్ని గమనంలో ఉంచుకుంటే, జాతీయవాద భావనలకు ఉన్న శక్తి ఏమిటో మనకు అర్థమవుతుంది. భారతీయ సమాజం మీద తమ ఆధిపత్యాన్ని తిరుగు లేని విధంగా నెలకొల్పు కోవాలనే ఉద్దేశంతో తమదైన ప్రత్యేక తరహా జాతీయవాదాన్ని సంఘ్ పరివార్ ముందుకు తెస్తున్నది. జాతీయోద్యమంలో ఏ నాడూ పాల్గొనని వీరు, జాతీయవాదం ముసుగులో బ్రాహ్మణీయ అగ్రకుల సంస్కృతినీ, విలువల్నీ ఈ దేశం మీద నిరంకుశంగా రుద్దాలని చూస్తున్నారు. జాతీయవాదం మీద, దేశభక్తి మీద పేటెంట్ హక్కు తమకు మాత్రమే ఉన్నాయని బుకాయిస్తున్నారు. తమ భావజాలాన్ని వ్యతిరేకించే వాళ్ళందరి మీద దేశ ద్రోహులనీ, జాతి వ్యతిరేకులనీ ముద్ర వేయాలని చూస్తున్నారు. **Scar, Tar, Mar** (భయపెట్టటం, తారు పూయటం, చంపెయ్యటం) అనే పాలసీని అవలంబిస్తున్నారు. దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. వాళ్ళకు నచ్చని నినాదాలు ఇస్తే శిక్షిస్తున్నారు. వాళ్ళకు నచ్చిన నినాదాలు ఇవ్వకపోతే కూడా శిక్షిస్తున్నారు. వాళ్ళకు ఆమోదం కాని ఆహారపు అలవాట్లు కలిగి ఉంటే చంపేస్తున్నారు. భిన్నమైన భావజాలం కలిగి ఉండి వాళ్లను వ్యతిరేకించిన గోవింద్

పన్సారే, దబోల్కర్, కల్బుర్గి, గౌరీలంకేష్ లాంటి వాళ్లను కాల్చి చంపారు. ఇతర మతాలకు చెందిన ప్రార్ధనాలయాలను కూల్చటం హిందూ ధర్మానికి విరుద్ధమని బాబ్రీ మసీదు కూల్చివేతను వ్యతిరేకించిన అయోధ్య రామజన్మభూమి పూజారి లాల్‌దాస్‌ను దారుణంగా హత్య చేశారు. ఎవరిని ప్రేమించాలో, ఎవరిని పెళ్ళి చేసుకోవాలో నిర్దేశిస్తూ 'ఫత్వాలు' జారీ చేస్తున్నారు. తాము చేస్తున్న అరాచకాలన్నింటినీ హిందూ సాంస్కృతిక జాతీయవాదం పేరుతో సమర్థించుకుంటున్నారు.

భీమా కొరెగావ్‌తో దళితులపై అగ్రకులాలు దాడిచేస్తే అగ్రకులాలను వదిలిపెట్టి పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడే మేధావుల మీద కుట్రకేసులు బనాయించటం దీనికి తాజా ఉదాహరణ. తమకు నచ్చని విషయాలను వ్యక్తుల్ని అణచివేయటానికి చట్టపరిధిలోను, రాజ్యాంగ పరిధిలో సాధ్యం కాకపోతే భజరంగ్‌దళ్ వంటి తమ వీధి సైన్యాల్ని రంగంలోకి దించుతున్నారు.

కాంగ్రెస్ వంటి ఇతర పాలకవర్గ పార్టీలు అరుదైన సంక్షోభ సమయాల్లో మాత్రమే ప్రత్యర్థుల మీద దాడి చేయటానికి వీధి సైన్యాన్ని, రౌడీల్ని రంగంలోకి దించుతాయి. వారి సాధారణ రాజకీయ ఎజెండాలో అవి భాగం కాదు. సంఘ పరివార్/ బి.జె.పిలు మాత్రం వీధిసైన్యాల దాడుల్ని తమ రోజువారీ రాజకీయ కార్యాచరణలో భాగంగా అభివృద్ధి చేశాయి.

బి.జె.పి. వాళ్ళు ప్రవచిస్తున్న జాతీయవాదం అర్థం కావాలంటే ముందుగా 'జాతి, జాతీయవాదం' అనే భావనలు ఏ పరిస్థితుల్లో ఎలా రూపొందాయో, ఏయే విలువలు భారత జాతీయవాదానికి బీజాలు వేసి దాన్ని పెంచి పోషించాయో అర్థం చేసుకోవాలి.

**జాతి – జాతీయవాదం:**

ఒకే భాష, ఉమ్మడి చారిత్రక వారసత్వ సంస్కృతి, ఒకే విధమైన ఆచార వ్యవహారాలు, వేషభాషలు, అలవాట్లు కలిగి ఒక నిర్దిష్ట భూభాగంలో నివసించే ప్రజా సమూహాన్ని ఒక జాతిగా పేర్కొంటారు.

ఒక నిర్దిష్ట భూభాగంలో ఒకే జాతి ప్రజలు నివసిస్తున్న సందర్భాలలో జాతి రాజ్యాల ఏర్పాటుకు పెద్దగా ఆటంకాలు ఉండవు. యూరప్‌లో ఏర్పడిన జాతి రాజ్యాలన్నీ దాదాపు అదే విధంగా ఏర్పడ్డాయి.

ఐరోపా జాతీయవాదానికి మొదటి నుంచీ ఆధిక్యతా భావం ఉంది. తమ జాతే మిగతా జాతుల కంటే నాగరీకమైనది, ఉన్నతమైనదన్న భావనతో ఇతర జాతులపై దాడి చేసి, వాళ్ల భూభాగాలను ఆక్రమించి, అక్కడి వనరులన్నింటిని కొల్లగొట్టే సామ్రాజ్యవాద జాతీయవాదంగా రూపొందింది. ఈ తరహా జాతీయవాదం తమ ప్రజలకు అంతర్గతంగా గానీ బాహ్యంగా గానీ ఒక శత్రువును చూపిస్తూ ఆ శత్రువుకి వ్యతిరేకంగా పోరాడటమే తమ జాతి జనుల విద్యుక్త ధర్మమని నిరంతరం ఊదర కొడుతుంది. తమ జాతి నివసించే భూభాగానికి దైవత్వాన్ని ఆపాదిస్తుంది. ప్రజల కంటే వాళ్లు నివసిస్తున్న భూభాగమే గొప్పదని; ప్రజలు అశాశ్వతం, భూభాగం శాశ్వతం అని; ఆ భూభాగం కోసం ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడటమే దేశభక్తి అని; ఈ భావనను ప్రశ్నించేవాళ్లు దేశద్రోహులనే; భావజాలాన్ని ప్రజల్లో వ్యాపింప చేస్తుంది.

'దేశం నీ కోసం ఏం చేసింది అని కాదు, దేశం కోసం నువ్వేం చేశావు అనేది ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకోవాలి' అనే సూక్తి వెనక ఉన్నది ఈ భావజాలమే.

దేశం అభివృద్ధి చెందడమంటే పెట్టుబడి అభివృద్ధి చెందడమే. పెట్టుబడి అభివృద్ధి చెందితే చాలు దేశం తనంతటతానే అభివృద్ధి చెందుతుందని కార్పొరేట్ శక్తులు ప్రచారం చేస్తున్న అభివృద్ధి భావజాలానికి–ప్రజలకంటే దేశమే మిన్న, దేశం నాకేం చేసిందని ప్రజలెవరూ ప్రశ్నించకూడదు అని చెప్పే యూరోపియన్ ఫాసిస్టు జాతీయవాదం– అనుకూలమయినది.

ఈ తరహా జాతీయవాదం అభివృద్ధి చెందితేనే దేశంలోని ఉమ్మడి వనరులను కార్పొరేట్ శక్తులకు సాఫీగా కట్టబెట్టటం సాధ్యమవుతుంది. అందుకనే కార్పొరేట్ శక్తులు ఈ తరహా జాతీయ వాదాన్ని ప్రబోధించే సంఘ్‌పరివార్ శక్తులకు మద్దతు ఇస్తున్నాయి. ఈ తరహా జాతీయవాదానికి ప్రపంచంలో అత్యున్నత ప్రతినిధి హిట్లర్.

మూడో ప్రపంచదేశాలుగా పిలవబడే వలస పాలన కింద ఉన్న దేశాల్లో మరో తరహా జాతీయవాదం తలెత్తింది. వలస పాలనపై వ్యతిరేకత ఈ జాతీయవాదానికి పునాది. వివిధ భాషలు, వివిధ సంస్కృతులు, భిన్న మతాలకు చెందిన అనేక ప్రాంతాల ప్రజలను జయించి వలసపాలకులు వాళ్లందర్నీ ఒకే పాలన కిందకు తెచ్చారు. ఏ సమూహానికి ఆ సమూహం విడివిడిగా పోరాడితే

వలసపాలనను అంతమొందించటం అసాధ్యం కాబట్టి వలస పాలన కింద ఉన్న భిన్న జాతుల, భిన్న మతాల ప్రజలు ఐక్యంగా పోరాడక తప్పని పరిస్థితి ఏర్పడింది. అందరికీ సమానహక్కులు, అతి చిన్న మైనారిటీ జాతుల, మతాల ప్రజలకు కూడా వాళ్ల వాళ్ల సంస్కృతులను పరిరక్షించుకునే హక్కులు కల్పిస్తూ చట్టపరమైన రక్షణలు ఏర్పాటు చేయటం ద్వారా వలస పాలన కింద ఉన్న ప్రజలందరూ ఒక జాతి అనే భావాన్ని పెంపొందించటం, వలస పాలనలో ఉన్న భూభాగం అంతా ఒకే దేశం అనే భావాన్ని ప్రోది చెయ్యటం లక్ష్యంగా మూడో ప్రపంచంలో వలసదేశాల జాతీయవాదాలు తలెత్తాయి.

ఆఫ్రికా ఖండంలోనూ, భారత ఉపఖండంలోనూ బ్రిటిష్ వలసలుగా మారిన భూభాగాల్లో ఒకే విధమైన పరిపాలనా వ్యవస్థ, చట్టాలు, రాజ్యాంగ సంస్థలు ఉన్నాయి. కానీ ఆ భూభాగాల్లో ఉన్న ప్రజలు వేరు వేరు జాతులకూ, మతాలకూ చెందిన వారు. ఒకే జాతి ప్రజల్లో సహజంగానే ఎంతో కొంత సోదరభావం ఉంటుంది. వేరు వేరు జాతుల, ప్రజల మధ్య సోదర భావం నెలకొనటం కష్టం. కాబట్టి బ్రిటిష్ వలస ప్రాంతాల్లో వివిధ జాతుల ప్రజలను ఏకం చేసి వాళ్ల మధ్య సోదర భావాన్ని పెంపొందించి, వాళ్లను ఒక బలిష్టమయిన జాతిగా ఎలా తీర్చిదిద్దాలి అనే ప్రశ్నను ఆఫ్రికా ఖండంలోనూ, భారత ఉప ఖండంలోనూ బ్రిటిష్ వలస పాలనను వ్యతిరేకించే జాతీయ నాయకులు ఎదుర్కొన్నారు.

వలస పాలనలో ఉన్న భూభాగంలోని భిన్న జాతుల, భిన్న మతాల ప్రజలందరినీ కలుపుకొని పోవటం ఈ జాతీయవాదంలో ఉన్న ప్రముఖ లక్షణం. అలా కలుపుకు పోవటానికి అందరికీ సమాన హక్కులు మైనారిటీలకు రాజ్యాంగ పరిరక్షణలు కల్పిస్తూ ఆ ప్రాతిపదిక మీద సామరస్యపూరితమైన పౌర జాతీయవాదం భారత ఉపఖండంలోనూ, ఆఫ్రికా ఖండంలోనూ ముందుకు వచ్చింది.

భూభాగం కంటే ఆ భూభాగంలో నివసించే ప్రజలే ప్రధానమని ఈ తరహా జాతీయవాదం మాటవరసకైనా ఒప్పుకుంటుంది. తమ జాతే ప్రపంచంలో కెల్లా అత్యున్నతమైన జాతి అనే ఆధిక్యతాభావం ఈ తరహా జాతీయవాదానికి లేదు.

ఈ తరహా ఉదార పౌర జాతీయవాదానికి గాంధీ, నెల్సన్ మండేలాలు అత్యున్నత ప్రతినిధులు.

సాంస్కృతిక జాతీయవాదం పేరుతో సంఘ్‌పరివార్ ప్రచారం చేస్తున్న హిందూ మతోన్మాద జాతీయవాదానికి బీజాలు ఐరోపా జాతీయవాదంలోనూ, హిట్లర్ జాతీయవాదంలోనూ ఉన్నాయి.

గాంధీ ప్రవచించిన ఉదార పౌర జాతీయవాదం మన స్వదేశీ జాతీయ వాదం. సంఘ్‌పరివార్‌ది విదేశీ జాతీయవాదం.

వివిధ జాతుల మధ్య సోదరభావం పెంపొందించటం ఎట్టి పరిస్థితిలోనూ సాధ్యం కాదని, మైనారిటీ జాతులకు చెందిన ప్రజలు తమ తమ ప్రత్యేక సంస్కృతులను విడనాడి మెజారిటీ సంఖ్యగల జాతి సంస్కృతితో మమేక మవ్వాలని, అట్లా మమేకం కాకపోతే ఏ హక్కులూ లేకుండా జీవించటానికి సిద్ధపడాలని, దానికి అంగీకరించని మైనారిటీ జాతులను సంబంధిత భూభాగం నుంచి తరిమేయాలని లేదా ఆ జాతి ప్రజలను పూర్తిగా తుడిచిపెట్టాలని విదేశీ జాతీయవాదం భావిస్తుంది. మన సంఘ్‌పరివార్ వారి జాతీయవాదం ఇదే.

మొదటి జాతీయవాదాన్ని పౌర జాతీయవాదం అనీ, రెండో తరహా వాదాన్ని సాంస్కృతిక జాతీయవాదమనీ పిలుస్తున్నారు. తనకు నచ్చని జాతులను సంపూర్ణంగా సంహరించటానికి ప్రపంచం కనీ వినీ ఎరుగని మారణకాండనకు పాల్పడిన హిట్లర్ ఈ రెండో తరహా సాంస్కృతిక జాతీయవాదులకు ఆదర్శ పురుషుడు. బలహీనమైన ప్రజాస్వామ్యం కంటే హిట్లర్ తరహా పాలన ఎంతో మంచిదని సావర్కర్ పేర్కొన్నాడు.

జాతి, జాతీయవాదం అనేవి ఆధునిక పూర్వయుగంలో లేవు. ఆధునిక యుగంలో మాత్రమే ఆ భావనలు ఉనికిలోకి వచ్చాయి. వ్యవసాయక సమాజాలు అంతరించిపోయి పెట్టుబడిదారీ సమాజాలు ఆవిర్భవించిన తర్వాత మాత్రమే జాతి, జాతీయవాదం, దేశం, దేశభక్తి అనే భావనలు ఉనికిలోకి వచ్చాయి.

ఆధునిక పూర్వ సమాజాల్లో రాజ్యాలు, సామ్రాజ్యాలు మాత్రమే ఉన్నాయి. వాటి సరిహద్దులు కూడా యుద్ధాల ద్వారా, వివాహాల ద్వారా నిరంతరం మారుతూ వచ్చాయి. నిర్దిష్ట భౌగోళిక సరిహద్దులు కలిగిన దేశాలు ఎక్కడా లేవు. అధికారం దైవదత్తం, వంశపారంపర్యం అనే భావన ఉండేది.

ప్రస్తుతం యూరప్‌గా పిలవబడే ప్రాంతంలో సుమారు 1700 లకు పైగా రాజ్యాలున్నాయి. మధ్యయుగాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అని పిలువబడే

ప్రాంతంలో సుమారు 30కి పైగా రాజ్యాలున్నాయని చరిత్రకారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మనం భారతదేశం అని పిలుచుకునే భూభాగంలో సుమారు ఎనభై రాజ్యాలున్నాయని చైనా యాత్రికుడు హుయాన్ త్సాంగ్ పేర్కొన్నాడు.

**పెట్టుబడికి పెద్దరాజ్యాలు అవసరం:**

పెట్టుబడి ఎదుగుదలకీ వ్యాపారాభివృద్ధికీ చిల్లర మల్లర రాజ్యాలు, ఆటంకంగా ఉంటాయి. వివిధ రాజ్యాల్లో పన్నులు కట్టడం, ప్రభుత్వాల నుండి అనుమతులు తీసుకోవడం చాలా కష్టంతో కూడుకున్న పని. కాబట్టి రాజ్యాల సంఖ్య తగ్గటం, విశాలమైన దేశాలు ఏర్పడటం, దేశమంతా ఒకే విధమైన చట్టాలు ఉండటం పెట్టుబడి అభివృద్ధికీ, వ్యాపార అభివృద్ధికీ చాలా అవసరం. దాని మూలంగా ఒకే భాష, ఉమ్మడి సంస్కృతులు, చారిత్రక వారసత్వం గల ప్రజలందరూ వేరు వేరు రాజ్యాల్లో ఉండకూడదని, ఒకే దేశంగా ఏర్పడితే వాళ్లందరి మధ్య సోదరభావం వెల్లివిరిసి దేశ అభివృద్ధికి తోడ్పడతారని పెట్టుబడిదారీ సమాజంలో నూతనంగా ఉనికిలోకి వచ్చిన వర్గాలు భావించాయి. అందుకే చిల్లర మల్లర రాజ్యాలను నిర్మూలించి విశాల భూభాగంతో కూడిన జాతిరాజ్యాల ఏర్పాటుకు మార్గం సుగమం చేశాయి. రాజ్యాధికారం దైవదత్తం, వంశపారంపర్యం అనే భావనల్ని తోసిపుచ్చి, ప్రజలదే సార్వభౌమాధికారం, ప్రజలే పాలకుల్ని ఎన్నుకోవాలనే భావనల్ని పాదుకొల్పాయి. ప్రపంచంలోని ప్రస్తుత జాతిరాజ్యాలు ఆ విధంగానే ఉనికిలోకి వచ్చాయి. పెట్టుబడిదారీ విధానం, జాతిరాజ్యం, ప్రజల సార్వభౌమాధికారం ఈ మూడు భావనల్ని ఒక దాని నుంచి ఒకటి విడదీసి చూడలేం.

బ్రిటిష్ వాళ్ళు రాక ముందు ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఖండాలు ఉన్నట్లుగానే ఆసియా ఖండంలో అంతర్భాగంగా భారత ఉపఖండం ఉంది. కాని భారత దేశం అనేది లేదు. భారత ఉపఖండంలో అనేక ప్రాదేశిక రాజ్యాలు వున్నాయి. జాతి రాజ్యం ఒక్కటి కూడా లేదు. భారత జాతి కూడా బ్రిటిష్ వాళ్ళు వచ్చిన తర్వాత రూపొందిందే తప్ప, అంతకు ముందు లేదు. భారత ఉపఖండం వివిధ జాతుల నిలయం తప్ప, ఏ ఒక్క జాతికో స్వంతం కాదు.

అంతకు ముందున్న ప్రాదేశిక రాజ్యాలన్నింటినీ జయించి, తనకు కప్పం కట్టే సంస్థానాలను మినహాయించి, భారత ఉప ఖండాన్ని ఒకే రాజ్యంగా బ్రిటిష్

వాళ్ళు తీర్చిదిద్దారు. బ్రిటిష్ వాళ్ళకు వ్యతిరేకంగా ప్రారంభమైన పోరాటాలు ఉపఖండంలోని అన్ని జాతులనూ ఒకే తాటి పైకి తెచ్చి, భారత జాతీయోద్యమానికి బీజాలు వేశాయి. ఆధునిక విద్య, ప్రసార సాధనాలు, రవాణా వ్యవస్థలు అందుకు తోడ్పడ్డాయి. స్వపరిపాలన, స్వావలంబన, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం, లౌకిక వాదం అనే నూతన విలువలు సమాజంలోకి ప్రవేశించాయి. ఆ నూతన విలువల ప్రాతిపదిక మీదే జాతీయోద్యమ నిర్మాణం జరిగింది.

**జాతీయోద్యమంలో మూడు ధోరణులు:**

భారత జాతీయోద్యమం ఒకే మూసలో జరగలేదు. దానిలో కూడా వివిధ ధోరణులున్నాయి.

ప్రధానంగా మూడు ధోరణులున్నాయి.
ఒకటి – అగ్రకుల జాతీయవాదం
రెండు – అట్టడుగు కులాల జాతీయవాదం
మూడు– శ్రామిక వర్గ జాతీయవాదం

1857 తిరుగుబాటును ప్రథమ స్వాతంత్ర సంగ్రామం అని పేర్కొనటమే పెద్ద కుట్ర. బ్రిటిష్ వాళ్ల మూలంగా అధికారం కోల్పోయిన రాజులు, నవాబులు తమ అధికారాన్ని తిరగి పునరుద్ధరించుకోవటం కోసం జరిగిన పోరాటమే 1857 సిపాయిల తిరుగుబాటు తప్ప, సాధారణ ప్రజలకు దానితో ఏ సంబంధమూ లేదు. కానీ సాధారణ ప్రజల మద్దతు పొందటానికి మత భావనల్ని రేకెత్తించారు. సైనికుల తూటాల్లో ఆవు కొవ్వు, పంది కొవ్వు కలిపారనే మత సెంటిమెంటుని రేకెత్తించారు. బ్రిటిష్ వాళ్ల కంటె తమది మెరుగైన పాలన కాదు కాబట్టి, తమకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం సామాన్య ప్రజలకు లేదు కాబట్టి, మతపరమైన భావోద్రేకాలను రెచ్చగొట్టటం తప్ప వేరే విధంగా సామాన్య ప్రజల మద్దతు కూడగట్టుకోవటం సాధ్యం కాదని సిపాయిల తిరుగుబాటుకు నాయకత్వం వహించిన రాజులు ఆనాడే భావించారు. ఆ సిపాయిల తిరుగుబాటు కూడా ఉత్తర భారతదేశంలోని పూర్వ రాజులు, నవాబులకు సంబంధించినది తప్ప అది దేశవ్యాప్త తిరుగుబాటు కాదు.

తిరుగుబాటు చేసిన రాజులు, నవాబులు తమ రాజ్యాల్లో అగ్ర కులాలను తప్ప అణగారిన కులాలను మనుషులుగా కూడా పరిగణించే వారు కాదు. అది ముస్లిం రాజుల పాలనలో అయినా, హిందూ రాజుల పాలనలో అయినా.

బ్రిటిష్ పూర్వపు రాజుల పాలనతో అగ్రకులాలకి తాదాత్మనం ఉంది. బ్రిటిష్ రాకతో రాజులు, నవాబులతో పాటు తమకూ నష్టం వాటిల్లిందని అగ్రకులాలు భావించాయి.

1857 తిరుగుబాటు తర్వాత ఈస్ట్ ఇండియా కంపెనీ స్థానంలో బ్రిటిష్ ప్రభుత్వమే ప్రత్యక్షంగా పాలనా పగ్గాలను చేపట్టింది. తమ పరిపాలన పదికాలాల పాటు సజావుగా సాగాలంటే స్థానికుల ఆచార వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని నిర్ణయం తీసుకొంది. ఆ నిర్ణయం అగ్రకులాలకి వరంగా పరిణమించింది. భారతీయ సమాజంలో ఏ మార్పులు తీసుకు రావటానికి కృషి చేయకుండా తటస్థంగా ఉంటున్నామనే సాకుతో కుల అణచివేతల, స్త్రీల అణచివేతలు గురించి పట్టించుకోకుండా అణగారిన కులాలపై అగ్రకులాల ఆధిపత్యం కొనసాగటానికి బ్రిటిష్ పాలన తోడ్పడింది.

భారతీయ సమాజంలో విద్య మీద సాంప్రదాయకంగా గుత్తాధిపత్యం బ్రాహ్మణులకే ఉండటం వల్ల ఆధునిక విద్యని కూడా బ్రాహ్మణులే అంది పుచ్చుకున్నారు. తద్వారా పెద్దఎత్తున ప్రభుత్వ ఉద్యోగాల్లోకి ప్రవేశించగలిగారు. సాంప్రదాయం పేరుతో చాలా కాలం వరకూ అట్టడుగు కులాలను పాఠశాలలోకి ప్రవేశించకుండా అడ్డుకొన్నారు.

అట్టడుగు కులాల వత్తిడికి లొంగి వాళ్లకు కూడా పాఠశాలల్లోకి, ప్రభుత్వ ఉద్యోగాల్లోకి ప్రవేశం కల్పించటానికి బ్రిటిష్ వాళ్లు నిర్ణయం తీసుకున్నపుడు అది భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను నాశనం చేసే చర్య అనీ, భారతీయ సంస్కృతి మీద విదేశీ సంస్కృతి దాడి అనీ బాలగంగాధర్ తిలక్ నాయకత్వాన చాలామంది కుహనా జాతీయవాదులు బ్రిటిష్‌వాళ్లను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేశారు. కుల వివక్షతతో కూడిన భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకోవటమే జాతీయవాదం అన్నారు. తామే జాతీయవాద నాయకులం అన్నారు.

ఈ అగ్రకుల జాతీయవాదంలో కూడా రెండు ధోరణులున్నాయి. ఒకటి – మితవాద జాతీయవాదం. రెండు మతవాద జాతీయవాదం.

**మితవాద మతవాద జాతీయవాదాలు:**

మొత్తం మీద బ్రిటిష్ పాలన భారతదేశానికి సామాజికపరంగా ముంచేసిందనీ, కాని ఉద్యోగాల్లో, పాలనలో అర్హులయిన భారతీయుల పట్ల (అగ్రకుల ఆంగ్ల విద్యావంతుల పట్ల) వివక్ష ప్రదర్శిస్తున్నదనీ, భారతీయ ఆర్థిక వనరుల్ని కొల్లగొడుతున్నదనీ మితవాద జాతీయవాదులు అభిప్రాయపడ్డారు. కాబట్టి బ్రిటీష్‌వాళ్లని పారద్రోలి, స్వపరిపాలనను నెలకొల్పటమే జాతీయవాదం యొక్క ఏకైక లక్ష్యమని ప్రచారం చేశారు.

బ్రిటిష్ వాళ్ళని పారద్రోలటానికి ప్రజలందరి సహకారం కావాలి కాబట్టి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువల్ని వారు మాటవరసకు అంగీకరించారు కాని వాటికోసం ఏనాడూ నిజమైన కృషి చెయ్యలేదు.

బ్రిటిష్ వాళ్లు ఆర్థిక వనరుల్ని కొల్లగొట్టటం, ఉద్యోగాలను నిరాకరించటమే కాకుండా అనాదినుంచి వస్తున్న భారతీయ సంస్కృతిని ధ్వంసం చేస్తున్నారనీ కాబట్టి వెంటనే తరిమికొట్టి భారతీయ సంస్కృతిని (వైదిక వర్ణాశ్రమ ధర్మ సంస్కృతిని) పునరుద్ధరించుకోవాలని మతవాద జాతీయవాదులు భావించారు. ప్రపంచ మొత్తంలోనూ వైదిక మతమే గొప్ప మతమని, ప్రపంచానికి మార్గ నిర్దేశం చేయగల శక్తి వైదిక మతానికే ఉన్నదని, వైదిక మతం పరిఢవిల్లిన కాలంలో ప్రజలందరూ ఏ సమస్యలూ లేకుండా సుఖశాంతులతో జీవించారని, అది స్వర్ణ యుగమనీ, బౌద్ధ జైన మతాలు రంగంలోకి వచ్చి వైదికమతాన్ని బలహీనపరిచిన తర్వాత మాత్రమే భారతీయ సమాజంలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని, మొఘలులు, ఆంగ్లేయులు లాంటి విదేశీయుల రాకతో సమస్యలు మరింత పెరిగిపోయాయనీ మతవాద జాతీయవాదం భావించింది.

వైదిక మతం ప్రాబల్యంలో ఉన్న కాలంలో వర్ణాశ్రమ ధర్మాలు పరిఢవిల్లటం వలన సమాజంలో సామరస్యం నెలకొన్నదనీ, ఏ వర్ణానికి సంబంధించిన ధర్మాన్ని ఆ వర్ణ ప్రజలు ఆచరించినంత కాలం ఏ సమస్యలు లేవనీ, వర్ణాశ్రమ ధర్మాల్ని ప్రశ్నించటంతోనే అన్ని సమస్యలూ వచ్చాయనీ మత జాతీయ వాదులు చెప్తున్నారు.

బ్రిటిష్‌వాడిని త్వరగా పారద్రోలాలంటే అగ్రకులాధిపత్యానికి గణనీయమైన ముప్పు ఏర్పడనంతవరకూ ముస్లింలనూ, దళితులనూ కూడా కలుపుకొని వెళ్ళాలని

మితవాద జాతీయవాదులు భావించగా అధికార మార్పిడి ఆలస్యమైనా పర్వాలేదు కాని ముస్లింలకూ, దళితులకు ఏ మాత్రం రాయితీలు ఇవ్వకూడదని మతజాతీయవాదులు భావించారు. పై రెండు జాతీయ వాదాలూ మతం విషయంలో విభేదిస్తాయి తప్ప, సారాంశంలో రెండూ కూడా అగ్రకుల జాతీయ వాదాలే. గాంధీ ఉదార అగ్రకుల జాతీయవాదానికి ప్రతినిధి. కానీ, ఆయన కూడా, హిందూమత ప్రతీకలను, రామరాజ్యం అనే భావనను, ప్రజలను సమీకరించటానికి వాడుకున్నాడు. తద్వారా జాతీయవాదాన్ని పెంపొందించటానికి మతాన్ని వాడుకోవటం పెద్ద తప్పు కాదు అనే సందేశాన్ని పంపించాడు. కాకపోతే గాంధీ మతాన్ని నైతిక విలువల సమాహారంగా చూశాడు. అందుకే సర్వధర్మ సమభావన, అన్ని మత విలువల్ని సమాదరించటం అనే ఆదర్శాలకు తన జీవితాంతం కట్టుబడి ఉన్నాడు. కాని అగ్రకుల మత జాతీయవాదులు మతాధిపత్యాన్నే లేదా సున్నితమయిన భాషలో చెప్పాలంటే సాంస్కృతిక ఆధిపత్యాన్నే అంతిమ ఆదర్శంగా తీసుకొన్నారు. తమ మతాన్ని, సంస్కృతినీ ఆమోదించని వాళ్లను దేశం నుంచి వెళ్లగొట్టటం, లేదా చంపివేయటం ద్వారానే పటిష్టమయిన జాతి నిర్మాణం చేయగలమని భావించారు.

అగ్రకుల హిందూ జాతీయవాదానికి మానవీయ స్పర్శ ఉండాలనీ, భిన్న మతాలనూ భిన్న సంస్కృతులనూ కలగలుపుకొని వెళ్ళాలనీ చెప్పినందుకూ, కృషి చేసినందుకే మతవాద అగ్రకుల జాతీయవాదులు గాంధీని హత్య చేశారు.

బ్రిటిష్ పూర్వ సమాజంలో ఉన్నదంతా అగ్రకుల ఆధిపత్యం అనీ, ఆర్థిక వనరులు, అధికారం, విజ్ఞానం మొత్తం అగ్రకులాల గుప్పెట్లోనే ఉన్నాయని వాటిలో అణగారిన కులాలకు సముచితమైన వాటా కల్పించకుండా బ్రిటిష్ వాళ్లని పారదోలినప్పటికీ వచ్చేది అగ్రకులాల స్వాతంత్ర్యం తప్ప, అణగారిన కులాల స్వాతంత్ర్యం కాదనీ, అన్ని రంగాల్లో సమానత్వ ప్రాతిపదిక మీద మాత్రమే ప్రజల్లో నిజమైన సౌభ్రాతృత్వం రూపొందుతుందనీ అప్పుడు మాత్రమే ఈ దేశంలోని ప్రజలందరూ ఒక జాతిగా రూపొందగలరనీ, పూలే అంబేద్కర్ లాంటి వాళ్ళు అట్టడుగు కులాల జాతీయవాదాన్ని ప్రతిపాదించారు.

వనరుల మీద ధనికుల పెత్తనం ఎప్పటినుంచో అనాదిగా కొనసాగుతున్నదనీ, ఆర్థిక సమానత్వం కోసం కృషి చెయ్యకుండా బ్రిటిష్ వాళ్ల

నుండి స్వాతంత్ర్యం వచ్చినట్లు కాదనీ భగత్‌సింగ్, కమ్యూనిస్టుల వంటివాళ్లు శ్రామిక వర్గ జాతీయవాదాన్ని ప్రతిపాదించారు.

గాంధీ, అంబేద్కర్, భగత్‌సింగ్‌లు వేరు వేరు ధోరణులకు ప్రాతినిధ్యం వహించినప్పటికీ స్వపరిపాలన, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ, ప్రజాస్వామ్యం, సర్వధర్మ సమభావన అనే విలువలను ఈ ముగ్గురూ అంగీకరించారు. ఆ విలువలు పాశ్చాత్య విలువలు అనీ, భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలకు వ్యతిరేక విలువలనీ మతోన్మాద అగ్రకుల జాతీయవాదులు వాటిని తోసిపుచ్చి హిందూ మత సంస్కృతిని పెంచి పోషించే సాంస్కృతిక జాతీయవాదమ్ ఈ దేశానికి అవసరం అంటున్నారు.

అయితే ఈ నూతన విలువలు గత కాలపు ఫ్యూడల్ సంకెళ్ళను ఛేదించి, తమకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తాయనే నమ్మకంతోనే అశేష ప్రజా బాహుళ్యం జాతీయోద్యమంలో పాలుపంచుకొంది. బ్రిటిష్ వాళ్ళను తరిమికొట్టింది. దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించింది. ఈ నూతన విలువలను వ్యవస్థీకరిస్తూ బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగ రూప కల్పన జరిగింది. ఈ ఆధునిక విలువల పునాది మీదే భారత జాతి ఏర్పడింది. భారత దేశం రూపొందింది.

**సాంస్కృతిక జాతీయవాదం:**

ఈ ఆధునిక విలువలను వ్యతిరేకించే తిరోగామి శక్తులైన హిందూ మహాసభ, ఆర్.యస్.యస్., ముస్లిం లీగ్ లాంటి వాళ్ళు స్వాతంత్ర్యోద్యమానికి దూరంగానే ఉండిపోయారు. బ్రిటిష్ వాళ్ళకు అడుగడుగునా సహకరించారు. మతోద్రేకాలు రెచ్చగొట్టి, ప్రజలలో మతపరమైన విభజనలు తీసుకురావటం ద్వారా బ్రిటిష్ వాళ్ళ విభజించు, పాలించు పాలసీకి శక్తి వంచన లేకుండా తోడ్పడ్డారు. ఈ ఉపఖండం మత ప్రాతిపదిక మీద భారత్, పాకిస్తాన్ అనే రెండు దేశాలుగా విడిపోటానికి కారకులయ్యారు. పాకిస్తాన్‌ను మతపరమైన రాజ్యంగా తీర్చి దిద్దటంలో ముస్లిం లీగ్ విజయం సాధించింది. తమ సోదరులైన ముస్లిం లీగ్ బాటలోనే భారత దేశాన్ని కూడా మతపరమైన రాజ్యం గా తీర్చి దిద్దటానికి సంఘ్ పరివార్ శక్తులు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. దానికి 'సాంస్కృతిక జాతీయవాదం' అని అందమైన పేరు పెట్టాయి.

"హిందూ సంస్కృతికి విధేయులుగా ఉండని వాళ్ళు, కనీస పౌర హక్కులు పొందటానికి కూడా అర్హులు కారు" అని సంఘ్‌పరివార్ ముద్దుగా గురూజీ అని

పిల్చుకొనే గోల్వాల్కర్ గురూజీ గారు ప్రవచించి ఉన్నారు. కాని హిందూ సంస్కృతి అంటే ఏమిటో ఈ గురూజీ గారితో సహా ఎవరూ నిర్వచించలేదు. ఇంతవరకు హిందూ మతాన్ని కూడా ఎవరూ నిర్వచించలేదు. హిందూ మతాన్ని నిర్వచించలేమనీ, అది ఏ నిర్వచనానికీ లొంగదనీ, అదొక జీవన విధానమనీ అంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే తమ మతాన్ని నిర్వచించని లేదా నిర్వచించలేని వాళ్ళ మతమే హిందూ మతమని బుకాయిస్తున్నారు.

**హిందూ భౌగోళిక పదం:**

వాస్తవానికి బ్రిటిష్ వాళ్ళు రాక ముందు హిందూ మతమనేదే లేదు. భారత ఉపఖండంలో అనేక మతాలున్నాయి. బౌద్ధ మతం ఉంది. జైన మతం ఉంది. వైష్ణవ, శైవ, సిక్కు, సిద్ధ, నాథ, తంత్ర, భక్తి, కబీర్‌పంథ్, వర్కరీ, మహానుభావ లాంటి మతాలు, మతశాఖలు వున్నాయి. కానీ హిందూ మతమనేది ఎక్కడా లేదు. అసలు హిందూ అనే పదమే మత సంబంధమైంది కాదు. క్రీ.శ. 8వ శతాబ్దం దాకా హిందూ అనే పదం ఏ గ్రంథంలోనూ లేదు. పర్షియన్లూ, అరబ్బులూ భారత ఉపఖండంలోకి ప్రవేశించిన తర్వాత మాత్రమే హిందూ అనే పదం ఉనికిలోకి వచ్చింది. పర్షియన్ భాషలో 'స' అక్షరాన్ని 'హ' గా ఉచ్చరించటం వల్ల వాళ్ళు 'సింధు' నదిని 'హిందు' గా ఉచ్చరించారు. సింధు నదికి తూర్పు వైపున ఉన్న భూభాగంలో నివసించే వాళ్లందరినీ హిందువులుగా పిలిచారు. హిందూ అనేది భౌగోళిక సంబంధమైన పదం మాత్రమే. మతానికీ దానికీ ఏ సంబంధం లేదు.

క్రీస్తుపూర్వం నాలుగువేల సంవత్సరం నుండి పదిహేను వందల సంవత్సరాల వరకు సింధూ నాగరికత ఈ దేశంలో ఉంది. క్రీ.పూ 2500 లేదా 2000 నుండి మాత్రమే ఆర్యుల రాక ఈ దేశంలోకి ప్రారంభమయింది. ఆర్యుల రాక కంటే 1500 ఏళ్ల ముందే సింధూ నాగరికత ఉచ్ఛదశలో ఉంది. హరప్పా, మొహంజదారో వంటి అభివృద్ధి చెందిన ప్రణాళికతో కూడిన పట్టణాలు ఉనికిలో ఉన్నాయి. సంచార దశను దాటివచ్చి వ్యవసాయ రంగంలో గణనీయమైన అభివృద్ధిని సాధించిన తర్వాత మాత్రమే వర్తక వ్యాపారాల అభివృద్ధి, తద్వారా పట్టణాల అభివృద్ధి జరుగుతుంది. ఆర్యులు పశువుల కాపరులుగా సంచారదశలో ఉన్న కాలంలో సింధూ నాగరికతకు చెందిన ప్రజలు సాంకేతికంగానూ, సాంస్కృతికంగానూ చాలా ముందంజలో ఉన్నారు.

బహుశా మాతృస్వామ్య సమాజ అవశేషాల మూలంగా కావచ్చు, సింధూ ప్రాంత ప్రజలు 'అమ్మతల్లి'ని ఆరాధించారు. 'పశుపతి'ని ఆరాధించారు.

బ్రాహ్మణీయ వైదిక మతానికీ, సింధు ప్రజల మతానికీ సంబంధమే లేదు. సింధు ప్రజలు ఆచరించిన 'అమ్మతల్లి' ఆరాధనా మతమే ఈ దేశపు నిజమైన సనాతన లేదా అనాది మతం. దళిత, బహుజనుల్లో ఎక్కువ మంది ఈ రోజుకీ 'అమ్మ తల్లుల్ని' పూజిస్తున్నారు. మద్య, మాంసాలను అమ్మతల్లులకు నైవేద్యంగా సమర్పిస్తున్నారు. బ్రాహ్మణులూ, ఇతర అగ్ర కులాలూ అమ్మ తల్లుల్ని పూజించటం చాలా తక్కువ. కాబట్టి ఈ దేశపు అసలైన సనాతన సాంప్రదాయాన్ని ఈనాటికీ కొనసాగిస్తున్నది దళిత బహుజనులే.

ఆర్యులు ఈ దేశానికి వచ్చి స్థిరపడటం, సింధు నాగరికత అంతరించి పోవటం జరిగాక, యజ్ఞయాగాదులు, క్రతువులతో కూడిన బ్రాహ్మణీయ వైదిక మతం ఆవిర్భవించింది. పురోహిత వర్గంతో పాటు క్షత్రియ, వైశ్య, శూద్ర వర్గాలు ఏర్పడ్డాయి. దొంతరలతో కూడిన నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ ఆవిర్భావానికి బాహ్మణీయ వైదిక మతం బాటలు వేసింది. విరాట్ పురుషుని ముఖం నుండీ, భుజాల నుండీ, తొడల నుండీ, పాదాల నుండీ నాలుగు వర్ణాలు ఆవిర్భవించాయనీ, వాటిని దైవమే సృష్టించాడనీ వేదాలు పేర్కొన్నాయి. వర్ణాశ్రమ ధర్మాల్ని, కులవ్యవస్థను కాపాడటమే వైదిక మతం ప్రధాన కర్తవ్యమైంది.

బ్రాహ్మణీయ వైదిక మతాన్నీ, కులవ్యవస్థనూ నిరసిస్తూ ఇంతకు ముందే చెప్పినట్లు అనేక మతాలు, మత శాఖలూ ఈ దేశంలో ఆవిర్భవించాయి. అవన్ని కూడా బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ, సిక్కు, భక్తి, సూఫీ, నాధ్, తంత్ర, సిద్ధ, కబీర్ పంథ్, మహానుభావ, వర్కరీ లాంటి మతాలూ, మత శాఖలూ ఏదో ఒక దశలో ప్రజాదరణ పొందాయి.

వర్ణాశ్రమ ధర్మాలనూ, కులవ్యవస్థనూ సమర్ధించే మతాలూ, మత శాఖలూ సంస్కృత భాషకు పెద్ద పీటవేస్తే, వాటిని వ్యతిరేకించే మతాలూ, మత శాఖలూ స్థానిక జానపదుల భాషను తమ మత ప్రచారానికి వాడుకున్నాయి. కుల వ్యవస్థను నిరసిస్తూ వచ్చిన మతాల నుండి శ్రమణకులు, సంత్‌లు, సూఫీలు అనే వర్గాలు ఆవిర్భవించాయి. వీళ్ళు పూజారి వర్గానికి పూర్తిగా భిన్నం. పూజారులు తాము ఉన్నచోటనే సకల సౌభాగ్యాలు అనుభవిస్తూ, మత కర్మకాండలకు

ప్రాధాన్యమిచ్చారు. శ్రమణకులు, సంత్‌లు, సూఫీలు సర్వం త్యజించి, దేశాటన చేస్తూ, తమ తమ మతాల్లోని నైతిక విలువల్ని ప్రజలకు బోధించారు. కర్మకాండల కంటే నైతిక విలువలు ప్రధానమని నొక్కి చెప్పారు. పూజారులందరూ బ్రాహ్మణులు కాగా శ్రమణకులూ, సంత్‌లూ, సూఫీల్లో బ్రాహ్మణేతరులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. శూద్ర, దళిత కులాల నుండి వచ్చిన వాళ్ళు కూడా గణనీయం గానే ఉన్నారు.

**సౌలభ్యం కోసమ్ 'హిందూ' వాడుక:**

బ్రిటిష్ వాళ్ళు భారత ఉప ఖండం లోకి అడుగుపెట్టే నాటికి ఈ ఉప ఖండంలోనే పుట్టి పెరిగిన మతాలూ, మత శాఖలూ పదుల సంఖ్యలో వున్నాయి. బ్రిటిషర్లు, ఇతర యూరోపియన్ల దృష్టిలో మతానికి మూడు ముఖ్య లక్షణాలు ఉండి తీరాలి. అవి దేవుడు, పవిత్ర గ్రంథం, పురోహిత వర్గం. వీటిల్లో ఏ ఒక్క లక్షణం లేకపోయినా వాళ్ళు ఆ మతాన్ని మతంగా గుర్తించరు.

కాని ఈ ఉపఖండంలోని మతాలూ, మత శాఖలూ ఒకే దేవుణ్ణి అంగీకరించవు. ఎవరి దేవుడు వాళ్ళకున్నాడు. అందరికీ ఒకే పవిత్ర గ్రంథం లేదు. అదే విధంగా ఒకే విధమైన పూజారి వర్గం లేదు. అంటే ఈ మతాలూ, మత శాఖలూ పాశ్చాత్య ప్రపంచపు మత నిర్వచనాలకు లొంగలేదు అయినా వీటన్నిటికీ కలిపి పరిపాలనా సౌలభ్యం రీత్యా ఒకే పేరు పెట్టవలసిన అగత్యం బ్రిటిష్ వారికి ఏర్పడింది. సింధు నదికి తూర్పు వైపు ఉన్న భూభాగంలో నివసించే ప్రజలందరినీ హిందువులు అని పిలిచినట్లుగానే, ఈ ఉపఖండంలోనే పుట్టి పెరిగి, స్పష్టమైన నిర్వచనానికి లొంగని మతాలన్నింటికీ కలిపి హిందూ మతమని పేరు పెట్టారు.

ఛార్లెస్ గ్రాంట్ అనే ఈస్ట్ ఇండియా కంపెనీ డైరెక్టరు 1792లో మొట్టమొదటి సారిగా 'హిందూ మతం', 'హిందూయిజం' అనే పదాలను వాడాడు. అంతకు ముందు ఆ పదాలు లేవు. ఛార్లెస్ గ్రాంట్ కనిపెట్టిన ఈ కొత్త పదాలను బ్రిటిష్ ప్రభుత్వం స్వంతం చేసుకొని అధికారికంగా ఉపయోగించటం మొదలుపెట్టింది. క్రిస్టియన్ మిషనరీలకు వ్యతిరేకంగా పోరాడుతున్న స్థానిక మతాల నాయకులూ, బ్రిటిష్ వాళ్ళకు వ్యతిరేకంగా పోరాడుతున్న అగ్ర కులాల రాజకీయ నాయకులూ కూడా జనాన్ని సులువుగా సమీకరించటానికి,

హిందూమతం అనే పదం తమకు కూడా ఒక మంచి సాధనంగా ఉపయోగపడుతుందని భావించారు. ఆ పదానికీ, ఆ పదం వెనుక ఉన్న భావ జాలానికీ విస్తృత ప్రచారం ఇచ్చారు. వివిధ మతాల ఆచారాలు భిన్నంగా ఉన్నప్పటికీ, తామంతా హిందువులమే అనే భావనను అప్పటి తమ అవసరాల రీత్యా విస్తృతంగా వ్యాప్తి చేశారు. ఆ విధంగా బ్రిటిష్ వాళ్ళ కాలంలో సిండికేట్ హిందూ మతం ఆవిర్భవించింది.

భిన్నత్వానికి స్వస్తి పలికి, క్రిస్టియన్, ఇస్లాం మతాల తరహాలో ఏకత్వంతో కూడిన వ్యవస్థీకృత మతాన్ని ఈ దేశంలో నిర్మించటానికి రాజా రామ్మోహనరాయ్, దయానంద సరస్వతి లాంటి సంస్కర్తలు ప్రయత్నించారు. అయినప్పటికీ “ఏ భారతీయుడు కూడా తన మతానికి సంబంధించి తాను హిందువునని చెప్పుకోవటం లేదు. అతని మతం ఏమిటని అడిగితే, సాధారణంగా తాను ఏ శాఖకు చెందినవాడో చెపుతున్నాడు. ఉదాహరణకు నీది ఏ మతం అని అడిగితే, తాను శైవుడ్ని అని చెపుతున్నాడు అని 1921లో మద్రాసు జనాభా లెక్కల రిపోర్టు ముందుమాటలో జనాభా లెక్కల కమీషనరు రాశారు.

సంస్కృతంలో రచించబడిన మత గ్రంథాలకూ, బ్రిటిష్ ప్రభుత్వోద్యోగాల్లో గుత్తాధిపత్యం గల బ్రాహ్మణ వర్గం మతం గురించి చేస్తున్న వ్యాఖ్యానాలకూ మాత్రమే పాశ్చాత్య మేధావులు ప్రాధాన్యం ఇచ్చారు. తద్వారా వాళ్లు భారత సమాజ వాస్తవికత ను అర్థం చేసుకోలేక పోయారు. ఈ దేశం లోని బ్రాహ్మణ వ్యతిరేక మతాల సంస్కృతులను పరిగణన లోకి తీసుకోకుండా, బ్రాహ్మణీయ సంస్కృతిని మాత్రమే ఈ దేశ సంస్కృతిగా పరిగణించారు. దానికి ఆమోదముద్ర వేశారు. దానినే క్రొత్తగా ఉనికి లోకి వచ్చిన సిండికేట్ హిందూ మత సంస్కృతిగా అంగీకరించారు. ఆ ప్రాతిపదిక మీదే చట్టాలను రూపొందించారు. బ్రాహ్మణ వ్యతిరేక మతాల సంస్కృతులను చట్టం పరిధుల ఆవలికి నెట్టి వేశారు. సిండికేట్ హిందూ మతానికి కూడా వేదాలను, ఉపనిషత్తులనూ, మనుధర్మ శాస్త్రం లాంటి గ్రంథాలనూ మాత్రమే ప్రామాణిక గ్రంథాలుగా పరిగణించారు. దానినే కొత్తగా ఉనికిలోకి వచ్చిన కిచిడీ హిందూ మత సంస్కృతిగా అంగీకరించారు. ఆవిధంగా దేశీయ మతాలనూ, మత శాఖలను కలిపి ముద్దచేసి, బ్రాహ్మణీయ వైదిక సంస్కృతి ఆధిపత్యంగా గల నూతన కిచిడీ హిందూ మతాన్ని బ్రిటీష్ వాళ్ళూ, బ్రాహ్మణులూ, అగ్ర కుల రాజకీయ నాయకులూ కలిసి తయారుచేశారు.

బ్రిటిష్ వ్యతిరేకోద్యమ నాయకుల్లో కొంతమంది జనాన్ని సంఘటిత చేయటం కోసం హిందూ మత భావనను విస్తృతంగా వాడుకున్నారు. ఎవరి ఇళ్ళల్లో వాళ్ళు చేసుకునే పండుగలను బజార్లలోకి తీసుకొచ్చారు. గణేష్ చతుర్థి, దుర్గాష్టమి లాంటి పండుగలను సామూహిక ఉత్సవాలుగా తీర్చిదిద్దారు. దేవుళ్ళ మండపాలను రాజకీయ వేదికలుగా మార్చివేశారు.

హిందూ మతాన్ని సంస్కరించి, దానికి మానవీయ కోణం ఇవ్వటానికి గాంధీ లాంటి వాళ్ళు కొంత కృషి చేశారు. సర్వ మత సమభావన, ఏకం సత్ విప్రా బహుధా వదంతి (అస్థిత్వంలో ఉన్నది ఒక్కటే, దానినే విప్రులు వేర్వేరు పేర్లతో పిలుస్తున్నారు) అనేవి హిందూ మత మౌలిక విలువలనీ, కాబట్టి ఏ మతం పట్లా వివక్ష చూపకుండా, అన్ని మతాలకు సమాన గౌరవం ఇవ్వాలనీ గాంధీ ప్రచారం చేశాడు. బ్రాహ్మణ వ్యతిరేకోద్యమంలో పాల్గొంటున్న ఆధిపత్య కులాలకు చెందిన నాయకులు కూడా ఈ కిచిడీ హిందూ మతం మీద విమర్శలు ఎక్కుపెట్టి, దాన్ని సంస్కరించే ప్రయత్నం చేశారు.

**ఫూలే అంబేద్కర్‌ల వ్యతిరేకత:**

అట్టడుగు కులాల నుంచి వచ్చిన మహాత్మా జ్యోతిరావు ఫూలే, డా॥ బి.ఆర్. అంబేద్కర్ లాంటి నాయకులైతే ఈ హిందూ మతాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. హిందూ మతం అంటే కుల, వర్గ, పితృస్వామ్య అణచివేతలు, దోపిడీలు తప్ప మరోటి కాదని తేల్చి చెప్పారు. దానిని సంపూర్ణంగా నిర్మూలించటం తప్ప, సంస్కరించటం సాధ్యం కాదని చెప్పారు.

హిందూ మతం రూపొందడంతో పాటు బ్రిటిష్ పాలన మూలంగా భారతీయ సమాజంలో పెను మార్పులు సంభవించాయి. పారిశ్రామికవేత్తలు, కార్మికులు, ఆధునిక విద్యనభ్యసించిన మధ్యతరగతి విద్యావంతులు లాంటి అంతకు ముందు లేని నూతన వర్గాలు లేదా సమూహాలు ఉనికిలోకి వచ్చాయి.

ఈ నూతన సమూహాలు శరవేగంగా ఎదగటానికీ, తమ ప్రయోజనాలను పరిరక్షించుకోటానికీ, సమాజంలోకి కొత్తగా ప్రవేశించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం లాంటి విలువలను ఆదరించాయి. ఆ విలువల ప్రాతిపదికన భారత జాతీయ కాంగ్రెస్, హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ, ఇండిపెండెంట్ లేబర్ పార్టీ లాంటి అనేక సంస్థలనూ, సంఘాలనూ, పార్టీలనూ

స్థాపించాయి.

ఆధునిక విద్య, సైన్సు, పరిపాలనా విధానాల వలన సమాజంలో వచ్చిన మార్పుల కారణంగా ఆధునిక పూర్వ సమాజం లోని ప్రాబల్య వర్గాలైన రాజుల, జమిందారుల, నవాబుల, వివిధ మతాధిపతుల, పురోహిత వర్గాల ప్రాభవం క్రమంగా క్షీణించటం ప్రారంభమైంది. క్షీణిస్తున్న ఈ వర్గాలు తమ ప్రయోజనాల పరిరక్షణ కోసం, తమ ప్రాబల్యాన్నీ, పూర్వ వైభవాన్నీ పునరుద్ధరించుకోవటం కోసం ముస్లింలీగ్, హిందూ మహాసభ, ఆర్.యస్.యస్. లాంటి మతపరమైన పార్టీలనూ, సంస్థలనూ స్థాపించాయి.

కాశీ రాజు శివప్రసాద్ సింగ్ మరియు సంపన్న ముస్లిం కుటుంబానికి చెందిన సయ్యద్ అహ్మద్ ఖాన్‌లు కలిసి 1888లో యునైటెడ్ పేట్రియాటిక్ అసోసియేషన్ అనే సంస్థను స్థాపించారు. జమిందార్లు, రాజులు, నవాబులు, సంస్థానాధీశులు, జాగీర్దారులు ఈ సంస్థలో సభ్యులు. బ్రిటిష్ వారికి విధేయులుగా ఉంటూ వారి ప్రభుత్వాన్ని సమర్థించటమే నిజమైన దేశభక్తుల పని అని వారు ప్రచారం చేశారు.

హిందూ ముస్లింలు రెండు వేరువేరు జాతులని జిన్నా కంటే ముందు తిలకే పేర్కొన్నాడు.

మహమ్మదీయ ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ అనే సంస్థనూ, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీని సయ్యద్ అహ్మద్‌ఖాన్ స్థాపించాడు. 1906 డిసెంబర్‌లో 3000 మంది ప్రతినిధులతో ఢాకాలో మహమ్మదీయ ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ సమావేశం జరిగింది. ఆ సమావేశంలోనే అఖిల భారత ముస్లిం లీగ్ పార్టీని ఏర్పాటు చేయటం జరిగింది. ముస్లిం మెజారిటీ గల జాతి రాజ్యంగా పాకిస్తాన్‌ని ఏర్పాటు చేయటానికి అప్పుడే బీజాలు పడ్డాయి.

1937 వరకూ ముస్లిం ఉన్నత వర్గాల సంస్థగానే ముస్లిం లీగ్ మిగిలిపోయింది. కాని 1920ల నుండి హిందూమతోన్మాదం పెరిగిపోవటం, ఉత్తర భారతదేశంలో పెద్ద సంఖ్యలో మతకలహాలు చోటు చేసుకోవటం కాంగ్రెస్ పార్టీ కూడా హిందూ మత పరిభాషనే వాడటం మూలంగా సామాన్య ముస్లిం ప్రజల్లో అభద్రతాభావం పెరిగిపోయింది. అప్పటి నుండి ముస్లిం లీగ్ పార్టీని, దాని రాజకీయాలను సామాన్య ముస్లింలు కూడా ఆదరించటం మొదలయింది.

ఈ లోగా హిందువుల ప్రయోజనాలను పరిరక్షించే ఉద్దేశ్యంతో దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ హిందూ సభలు కూడా వెలిశాయి.

1915లో హరిద్వార్‌లో కుంభమేళా జరిగింది. అప్పుడు దేశవ్యాప్తంగా ఉన్న హిందూ సభల ప్రతినిధులందరూ కలిసి అక్కడ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని. 'సర్వదేశ హిందూ సభ' అనే విస్తృతమైన సంస్థను స్థాపించారు. 'సర్వదేశ' హిందూ సభ స్థాపనకు మద్దతుగా మహాత్మాగాంధీ కూడా ఆ సమావేశంలో పాల్గొన్నాడు. 1921లో ఆ సంస్థ పేరును 'అఖిల భారత హిందూ మహాసభగా మార్చారు. 'బనారస్ హిందూ విశ్వవిద్యాలయాన్ని' స్థాపించిన మదన్ మోహన్ మాలవియా, పంజాబ్‌కేసరిగా పేరొందిన లాలా లజపతిరాయ్‌లు ఈ హిందూ మహాసభకు నాయకులుగా ఉన్నారు. హిందూ రాజకీయ ఐక్యత కోసం, హిందువుల విద్య మరియు ఆర్థిక అభివృద్ధి కోసం ముస్లింలను హిందువులుగా మార్చటం కోసం వారు కృషి చేశారు. తర్వాత కాలంలో ఈ హిందూ మహాసభ సావర్కర్ లాంటి వాళ్ల చేతుల్లోకి వచ్చింది. హెడ్గే వార్ కూడా ఈ హిందూ మహా సభలో సభ్యుడిగా ఉండేవారు. 1925లో దాని నుంచి బయటకు వచ్చి ఆర్.ఎస్.ఎస్‌ను స్థాపించాడు.

ఆ తర్వాతే ఇరు దేశాల్లో మతోన్మాద శక్తులను సామాన్య ప్రజానీకం ఆదరించటం మొదలయింది. అయితే గాంధీ హత్య మూలంగా భారతదేశంలోని సామాన్య ప్రజల్లో మతోన్మాదుల పట్ల కొంత అయిష్టత చోటు చేసుకొంది.

దేశ విభజన తాలూకు మత కల్లోలాలు జరిగే వరకూ హిందుత్వ శక్తుల ప్రభావం అగ్రకుల సంపన్న వర్గాలకు మాత్రమే పరిమితమై ఉంది. దేశ విభజన సమయంలో అట్నుంచి ఇటూ, ఇటునుంచి అటూ కట్టుబట్టలతో వలస వచ్చిన కాందిశీకులు అవతల మతం వారి చేతుల్లో వాళ్లు పడ్డ కనీ వినీ ఎరుగని హింసను చూసిన, విన్న సామాన్య ప్రజల్లో కూడా మతావేశాలు పెల్లుబుకాయి.

**స్వాతంత్రోద్యమంతిని వివిధ పాయలు**

1920 సెప్టెంబరు నుండి 1922 ఫిబ్రవరి వరకు గాంధీ నాయకత్వంలో జరిగిన సహాయ నిరాకరణోద్యమం చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో శూద్ర కులాల సామాన్య ప్రజానీకాన్ని కూడా ఉద్యమంలో భాగస్వాములను చెయ్యగలిగింది. అట్టడుగు కులాల విద్యావంతులు కూడా రాజకీయాల్లోకి

గణనీయంగా ప్రవేశించారు. 1917 అక్టోబరు విప్లవ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా కనిపించింది కూడా అట్టడుగు వర్గాల్లో రాజకీయ కదలిక ప్రారంభమైంది. 1920లో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏర్పడింది. ప్రభుత్వానికీ, జమిందార్లకూ వ్యతిరేకంగా రైతుల పోరాటాలు పెల్లుబికాయి. రైతు సంఘాలు రక రకాల స్థానిక పేర్లతో దేశవ్యాప్తంగా ఏర్పడ్డాయి. ఖిలాఫత్ ఆందోళనకు గాంధీ నాయకత్వంలోని జాతీయ కాంగ్రెస్ మద్దతు తెలపగా గాంధీ సహాయ నిరాకరణోద్యమానికి ముస్లిం నాయకులు మద్దతు పలికారు. దాంతో బ్రిటిష్ వాళ్ళకు వ్యతిరేకంగా హిందూ-ముస్లింల ఐక్య పోరాటాలు దేశవ్యాప్తంగా జరిగాయి. అదే సమయంలో పశ్చిమ, దక్షిణ భారతదేశాల్లో బ్రాహ్మణ వ్యతిరేకోద్యమాలు తలెత్తాయి. దేశవ్యాప్తంగా దళిత ఉద్యమాలు కూడా పురుడు పోసుకున్నాయి.

1924- 1925నిల్లో జరిగిన వైకోమ్ సత్యాగ్రహాని కంటే 120 సంవత్సరాల ముందుగానే కేరళలోని ఎజవా కులానికి చెందిన వారు వైకోం దేవాలయ ప్రవేశానికి ప్రయత్నిస్తే వాళ్లని నరికి చంపి దేవాలయ ఈశాన్యదిక్కులో ఉన్న కోనేరులో పాతిపెట్టారు. దాదాపు అదే సమయంలో మద్రాస్ ప్రెసిడెన్సీలోని షెణార్లు తమ ఆడవాళ్లు జాకెట్లు తొడుక్కునే హక్కు కోసం పోరాడారు. షణార్లు అయ్యావజ్జి మార్గంగా పిలవబడే ముత్తుకుట్టి స్వామిని ఆరాధించే ఒక స్వతంత్ర బ్రాహ్మణేతర మతాన్ని అభివృద్ధి చేసుకొన్నారు. కేరళలోని హెజవాలు కూడా నారాయణ గురు నాయకత్వంలో తమకంటూ ఒక బ్రాహ్మణేతర మతాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అత్యంత అట్టడుగు కులమైన పులయా కులానికి చెందిన అయ్యంకాళి నిరక్షరాస్యుడు అయినప్పటికీ పులయా బాలికల కోసం స్కూళ్లు స్థాపించాడు. పులయాలు భిన్న వృత్తుల్లోకి ప్రవేశించాలన్న ఉద్దేశ్యంతో సాంకేతిక విద్యను కూడా వాళ్లకు అందుబాటులోకి తెచ్చాడు. భారతదేశంలోని మొట్టమొదటి వ్యవసాయ కూలీల సమ్మె ఈ అయ్యంకాళి నాయకత్వాన జరిగింది. అది ఆర్థికపరమైన డిమాండ్ల కోసం జరగలేదు. పులయా బాలికలకు విద్యా సంస్థల్లో ప్రవేశం కల్పించాలని, ప్రధాన రహదారుల మీద నడిచే హక్కు కావాలనీ, సంతల్లోకి ప్రవేశించే హక్కు కావాలనీ, స్వంత భూముల్ని కలిగి ఉండే హక్కు కావాలనే డిమాండ్ల కోసం ఆ సమ్మె జరిగింది. ఎజవాలు, పులయాలు, క్రిస్టియన్లు, ముస్లింలు కలిసి 1919లోనే 'సివిల్ రైట్స్ లీగ్' అనే సంస్థను స్థాపించారు. ఈ సంస్థ వయోజన ఓటు హక్కు, అందరికీ పౌర సమానత్వం, ప్రభుత్వోద్యోగాల్లో సముచితమైన వాటా కోసం ఉద్యమించింది.

తెలుగు దేశంలో కూడా పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి నాయకత్వంలో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం పురుడు పోసుకోవటం, బహుజన కులాల ఐక్యతకు బీజాలు పడటం, త్రిపురనేని రామస్వామి చౌదరి నాయకత్వంలో వ్యవసాయ శూద్ర కులాలు బ్రాహ్మణాధిక్యతను సవాలు చేయటం జరిగింది. భాగ్యరెడ్డి వర్మ వంటి వారి నాయకత్వంలో అగ్రకులాల ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ ఆది ఆంధ్ర ఉద్యమాలు కూడా తలెత్తాయి.

అలాగే మహారాష్ట్రలో జ్యోతిబాపూలే నాయకత్వంలో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు జరిగాయి. ఒరిస్సాలో బారి సమూహానికి చెందిన వాళ్లు భీమాబోయి నాయకత్వంలో 1881లో పూరీ జగన్నాథ ఆలయ ప్రవేశం కోసం ఆ ఆలయ గేట్ల మీద విరుచుకు పడ్డారు. అప్పుడు అగ్రకులస్థులు ఆలయంలోకి ప్రవేశించనీయకుండా వారిని చంపేశారు.

బెంగాల్‌లో 1880 ల్లోనే అట్టడుగు కులాలు నామ శూద్రుల పేరుతో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం నిర్వహించాయి. 'విద్యావంతులు కండి!' 'డబ్బు సంపాదించండి,' 'ఆత్మాభిమానంతో గౌరవంగా జీవించండి' అని అట్టడుగు కులాలకు పిలుపునిచ్చింది. స్కూళ్లు, హాస్టళ్లు స్థాపించి వాళ్లకు విద్యను అభ్యసించే అవకాశం కల్పించింది. వీరు హిందూ ఆధిపత్య కులాల రాజకీయాలకు వ్యతిరేకంగా ముస్లింలతో కలిసి కూడా పోరాడారు.

అస్సాంలో సోనాధర్ దాస్ సేనాపతి నాయకత్వంలో ఆల్ అస్సాం డిప్రెస్డ్ పీపుల్ కాన్ఫరెన్స్ ఏర్పడి అంబేద్కర్ భావజాలంతో ఉద్యమాలు నడిపింది.

బీహార్‌లో మహతోలు, ఉత్తరప్రదేశ్‌లో యాదవులు కుల సంఘాలు స్థాపించి కుల అసమానతలను సవాలు చేశారు. కొయిరీ, కుర్మ యాదవ కులాలు కలిసి త్రివేణీ సంఘ్ పేరుతో బ్రాహ్మణ వ్యతిరేక సంస్థను ఏర్పాటు చేశాయి.

ఉత్తర భారతదేశపు చమార్లు కూడా కుల సామాజిక సంకెళ్లనూ, సాంస్కృతిక బానిసత్వాన్నీ తెంచుకోవటానికి అనేక వీరోచిత పోరాటాలు చేశారు. ఛత్తీస్‌గఢ్‌కు వలస వెళ్లి ఆర్థిక పరిస్థితులు ఎంతో కొంత మెరుగు పరుచుకొన్న తర్వాత ఘాసీదాసు నాయకత్వంలో సత్నమి తెగగా రూపాంతరం చెందారు. మనుషులు అందరూ సమానులే. అందరికీ దేవుడొక్కడే అనే నినాదంతో ఒక బ్రాహ్మణ వ్యతిరేక మత

శాఖను ప్రారంభించారు. బ్రాహ్మణాధిపత్యాన్ని సవాలు చేయటానికి వాళ్లు కూడా జంధ్యాలు ధరించటం ప్రారంభించారు. జంధ్యం ధరించిన నేరానికి ఘాసీదాసు కొడుకైన బాలక్‌దాసును 1860లో అగ్రవర్ణాలు కిరాతకంగా హత్య చేశాయి.

రాజస్థాన్‌లో 19వ శతాబ్దపు ప్రారంభంలో రామ్‌దేవ్ పంత్, నావల్ ధరంల పేరుతో అట్టడుగు కులాలు వర్ణాశ్రమ ధర్మాలకు వ్యతిరేకంగా ఉద్యమించాయి.

వాయవ్య పంజాబ్‌లో చమార్లు 'ఆది ధర్మ' అనే నూతన మతశాఖను ప్రారంభించారు. తామే ఈ దేశానికి అసలయిన మూలవాసులమని, వైదిక మతం కంటే తాము ప్రబోధిస్తున్న ఆది ధర్మమే ఈ దేశవాసుల అసలయిన మతమనీ ప్రకటించారు. అగ్రవర్ణాల ఆధిక్యాన్ని సవాలు చేశారు.

1920వ దశకంలో వచ్చిన ఈ ఉద్యమాలన్నీ కలిసి హిందూయిజానికి పెను సవాళ్ళుగా పరిణమించాయి.

**ఆర్.యస్.యస్. స్థాపన:**

ఈ సవాళ్ళను ఎదుర్కోవటానికీ, వర్ణాశ్రమ ధర్మాలను, కుల వ్యవస్థను పదిలంగా కాపాడుకోటానికీ, హిందూ మత భావనలను ఈ దేశపు నరనరాల్లోకి ఎక్కించటానికీ అయిదుగురు చిత్‌పవన్ బ్రాహ్మణులు నాగపూర్‌లో సమావేశమై, హెగ్డేవార్ నేతృత్వంలో ఆర్.యస్.యస్.ను 1925లో స్థాపించారు. 'సంఘ్ వృక్ష్ కీ బీజ్' అనే తన జీవిత చరిత్రలో "బ్రాహ్మణ వ్యతిరేకోద్యమం ఉధృతం కావటం ఆర్.యస్.యస్. స్థాపనకు గల కారణాల్లో ఒకటి" అని హెగ్డేవార్ స్వయంగా అంగీకరించాడు.

సంస్థలో అంతర్గత ప్రజాస్వామ్యం అనేది ఉండకూడదనీ, నియంతృత్వ పద్ధతుల్లో సంస్థ పనితీరు ఉండాలనీ ఆ అయిదుగురు చిత్‌పవన్ బ్రాహ్మణులు ఒట్టు పెట్టుకున్నారు. అందుచేతనే ఆర్.యస్.యస్. లో ఎప్పుడూ, ఏ పదవికీ సంస్థాగత ఎన్నికలు జరగవు. నియామకాలు మాత్రమే జరుగుతాయి. సర్ సంఘ్ చాలక్ తన తర్వాత ఆ పదవిని చేపట్టాల్సిన వ్యక్తి పేరును ఓ పేపర్ మీద రాసి, సీల్డ్ కవర్ లో ఉంచుతాడు. సర్ సంఘ్ చాలక్ మరణం తర్వాత ఆ కవర్ ను చింపి, దాంట్లో ఎవరి పేరు ఉంటే వాళ్ళనే సర్ సంఘ్ చాలక్‌గా నియమిస్తారు.

ఆర్.యస్.యస్. లో స్త్రీలకు ప్రవేశం కల్పించకూడదని కూడా వాళ్ళు నిర్ణయం తీసుకున్నారు. విద్య, నిరంతర బోధనలు, ప్రచారాల ద్వారా సనాతన మానవుణ్ణి సృష్టించటం లక్ష్యంగా పెట్టుకున్నారు. సనాతన వైదిక వర్ణాశ్రమ ధర్మ సంస్కృతిని ఈ దేశ సంస్కృతిగా తీర్చి దిద్దాలని కంకణం కట్టుకున్నారు. బౌద్ధ, జైన మతాలూ, గాంధీ లాంటి వాళ్ళూ అహింసను ఒక మహోన్నతమైన విలువగా బోధించటం ద్వారా ఈ దేశ యువతను నిర్వీర్యం చేస్తున్నారని ప్రచారం చేశారు. యువకులకు ఆయుధశిక్షణ ఇచ్చారు.

ముస్లింలు, క్రిస్టియన్‌లపై విద్వేషాలు రెచ్చగొట్టటానికి చరిత్రను వక్రీకరించారు. అధికారం కోసం, సంపద కోసం మధ్యయుగాల్లో రాజుల మధ్య జరిగిన యుద్ధాలను మతవిశ్వాసాల కోసం జరిగిన యుద్ధాలుగా చిత్రీకరించారు. ముస్లిం రాకకు పూర్వం ఈ దేశంలో అంటరానితనం అనేది లేదని ప్రచారం చేస్తున్నారు. ముస్లిం దురాక్రమణదారుల చేతుల్లో ఓడిపోయిన రాజులు, ప్రజలు ప్రాణాలు రక్షించుకోవటానికి గ్రామాలకు, నగరాలకు బయట ఉన్న అరణ్యాల్లో తలదాచుకొన్నారని, కాలక్రమంలో వాళ్ళే అంటరాని వాళ్ళుగా, ఆదివాసులుగా రూపాంతరం చెందారని అంటున్నారు.

ముస్లింలు రాకపూర్వమే పలు హిందూ మతగ్రంథాల్లో ఛండాలుర గురించి ప్రస్తావనలు ఉండటాన్ని కప్పిపెడుతున్నారు. ఆ గ్రంథాల్లో పేర్కొన్న ఛండాలురు ఎవరనేది చెప్పకుండా దాటవేస్తున్నారు.

అదే విధంగా సతీ సహగమనం, బాల్య వివాహాలు, పరదాలు లాంటి దురాచారాలు కూడా ముస్లింల మూలంగానే భారతీయ సమాజంలోకి ప్రవేశించాయని, ముస్లింల చేతుల్లో పడి అత్యాచారాలకు గురయ్యే కన్నా ఆత్మాహుతి చేసుకోవటమే మంచిదని హైందవ స్త్రీలు భావించటం మూలంగా సతీ సహగమనం ఉనికిలోకి వచ్చిందని ఊదర గొడుతున్నారు. మహాభారతంలో పాండురాజుతో పాటు మాద్రి సహగమనం చేసిన విషయాన్ని మర్చిపొమ్మంటున్నారు.

ముస్లిం రాజులు ఈ దేశంలో వేలకొద్దీ దేవాలయాలను ధ్వంసం చేశారని, బలవంతపు మతమార్పిడులకు పాల్పడ్డారని ప్రచారం చేస్తున్నారు. కేరళలోకి ఏ ముస్లిం రాజు ప్రవేశించకముందే అక్కడికి వర్తకం కోసం సముద్రమార్గం ద్వారా వచ్చిన అరేబియన్ వ్యాపారుల తమవెంట తెచ్చిన ముస్లిం మతాచారాలను, ఆ

మతంలోని వాళ్లందరూ ఎక్కువ తక్కువలు లేకుండా సోదరభావంతో కలిసి మెలిసి ఉండటాన్ని చూసి ప్రభావితులై అట్టడుగు కులాలకు చెందిన కేరళ ప్రజలు పెద్ద సంఖ్యలో ఇస్లాంను స్వీకరించారనే విషయాన్ని దాచిపెడుతున్నారు.

ఈ దేశంలో ఉన్న ముస్లింలలో మతం మారిన అట్టడుగు కులాల ప్రజలే ఎక్కువమంది ఉన్నారని స్వామి వివేకానందుడు చెప్పిన విషయాన్ని కూడా మర్చి పొమ్మంటున్నారు.

**ఆలయాల కూల్చివేతలోని వాస్తవాలు:**

మధ్యయుగాల్లో భారత ఉపఖండంలో కూలగొట్టబడిన మొత్తం హిందూ దేవాలయాల సంఖ్య 80కి మించి లేవని రిచర్డ్ ఈటన్ అనే పరిశోధకుడు 'మధ్య యుగాల్లో దేవాలయాల విధ్వంసం' గురించి రాసిన గ్రంథంలో ఆధారాలతో సహా పేర్కొన్నాడు. ఆ కాలంలో హిందూరాజులు హిందూ దేవాలయాల్ని ధ్వంసం చేసిన సంఘటనలు కూడా గణనీయంగానే జరిగాయి. దేవాలయాలు సంపదలకు కేంద్రాలుగా ఉండటం, కొన్ని దేవాలయాలు రాజుగారి వంశ ప్రతిష్టలతో ముడిపడి ఉండటం మూలంగా దేవాలయాల మీద దాడులు జరిగాయ్ తప్ప ఆ దాడులకు మత విద్వేషాలు కారణం కాదు.

హిందూ రాజే అయిన హర్షుడి ఆస్థానంలో దేవాలయాలను కూలగొట్టటానికి ఒక ప్రత్యేకమైన శాఖ ఉండేదనీ, ఆ శాఖను నిర్వహించే అధికారిని 'దేవోత్పతన నాయకుడు' అని పిలిచేవారనీ కల్హణుడు రచించిన 'రాజతరంగిణి' గ్రంథంలో ఉంది.

అయోధ్యలోనే కాకుండా కాశీ, మధురల్లో కూడా ముస్లిం రాజులు మతద్వేషంతో దేవాలయాలను కూలగొట్టి మసీదులు కట్టారనీ, అయోధ్య అయిపోయింది. కాని కాశీ, మధురలు ఇంకా బాకీ ఉన్నాయని సంఘ్ పరివార్ ⁻ పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నది. ఔరంగజేబు తీవ్రమైన మత అసహనపరుడని కాశీ, విశ్వేశ్వర దేవాలయాన్ని కూలగొట్టి అక్కడ మసీదు కట్టించాడని నిందిస్తున్నారు.

ఈ ఆరోపణలో వాస్తవం ఎంత ఉందో పరిశీలిద్దాం.

ఔరంగజేబు తన పరివారంతో దేశాటన చేస్తూ కాశీ వెళ్లాడు. ఆయన వెంట హిందూ, ముస్లిం మతాల సామంతరాజులు కూడా ఉన్నారు. కాశీ విశ్వేశ్వరుని

దర్శించుకొని వస్తాం అని హిందూరాజులు అభ్యర్థించినందు వల్ల కాశీలో ఒకరోజు విడిది చేశాడు. ఆయన పరివారంలో ఉన్న కచ్ రాజు భార్య కచ్ రాణి సర్వాలంకార భూషితమై కాశీవిశ్వేశ్వరుని దర్శనానికి వెళ్లింది. కానీ తిరిగి రాలేదు.

దేవాలయంలోనూ వెలుపలా వెదికినా ఆమె కన్పించలేదు. దేవాలయాన్ని మరోసారి క్షుణ్ణంగా వెతకమని ఔరంగజేబు సైనికులను ఆదేశించాడు. అప్పుడు దేవాలయానికి రహస్య నేలమాళిగ ఉందని సైనికులు కనిపెట్టారు. దేవాలయ మహంతులు అడ్డుకున్నా లెక్క చేయకుండా తలుపులు బద్దలు కొట్టి నేలమాళిగ లోకి ప్రవేశించారు. అక్కడ కచ్ రాణి స్పృహలేకుండా కొనఊపిరితో పడి ఉంది. ఆమె ఒంటి మీద ఒక్క ఆభరణం కూడా లేదు. వైద్యపరిచర్యల అనంతరం కోలుకున్న కచ్ రాణి జరిగిన విషయాన్ని వివరించింది.

దేవాలయమంతా తిప్పిచూపిస్తామని ఒక మహంతు నేలమాళిగలోకి తీసుకువెళ్లి తనపై దాడి చేసి కొడితే తను స్పృహ కోల్పోయానని, తన విలువైన ఆభరణాలన్నీ ఆ మహంతే కాజేసి ఉంటాడని ఆమె చెప్పింది. విలువైన ఆభరణాలు ధరించి దర్శనానికి వచ్చే స్త్రీలను కాశీ ఆలయ మహంతులు ఇదే పద్ధతిలో దోపిడీ చేస్తున్నారనీ, ఇది మొదటిసారి కాదనీ ఔరంగజేబు విచారణలో తేలింది. ఇటువంటి హీనమైన నేరాలు జరిగిన ప్రదేశంలో దేవునికి ఇల్లు ఉండటం మంచిది కాదని, ఆలయాన్ని కూల్చమని ఔరంగజేబు సైనికులను ఆజ్ఞాపించాడు. ఆలయ ధ్వంసంతో కచ్ రాణి సమాధానపడలేదు. అలాగే వదిలేసి వెళ్ళిపోతే ఆలయాన్ని పునర్నించుకొని మహంతులు మరలా అదే తరహా దోపిడీలకు పాల్పడతారనీ, కాబట్టి అక్కడ మసీదును కట్టించమనీ ఔరంగజేబును వేడుకొంది. ఆమె కోర్కె ప్రకారం ఔరంగజేబు అక్కడ మసీదు కట్టించాడు. ఆ మసీదే ప్రస్తుతం కాశీ విశ్వనాథుని దేవాలయాన్ని ఆనుకొని ఉన్న మసీదు (ఆధారం: భోగరాజు పట్టాభి సీతారామయ్య రచించిన స్టోన్స్ అండ్ ఫెదర్స్ గ్రంథం).

ఔరంగజేబు తన జీవితకాలంలో ఎన్నో హిందూ దేవాలయాలకు, పూజారులకు గ్రాంట్లు, ఈనాములు ఇచ్చాడు. అలాగే హైదరాబాద్ గోల్కొండ కోటలో గల ఒక మసీదును కూడా కూలకొట్టించాడు. అప్పటి గోల్కొండ ప్రభువు తానీషా ఔరంగజేబుకి సామంత రాజుగా ఉండేవాడు. ఔరంగజేబుకి చెల్లించాల్సిన

కప్పం తానీషా కట్టలేదు. కప్పం కట్టమని కబురు చేస్తే ఔరంగజేబుకి శత్రువు అయిన రాజులతో చేతులు కలిపి ధిక్కార పూరిత సమాధానం పంపించాడు. అప్పుడు ఔరంగజేబు దండెత్తివచ్చి గోల్కొండను స్వాధీనం చేసుకొన్నాడు. తానీషా ఖజనాలో ధనం లేదు. ఏమయిందని ప్రశ్నిస్తే గోల్కొండ కోటలోనే మసీదు కింద దాచిపెట్టానని తానీషా జవాబు ఇచ్చాడు. ఆ ధనం కోసం ఔరంగజేబు మసీదుని కూలగొట్టించాడు. కానీ డబ్బులు దొరకలేదు. తానీషా అబద్ధమాడాడని తెలిసిపోయింది. ఆగ్రహించిన ఔరంగజేబు తానీషాను ఔరంగాబాద్‌లోని తన కోటలో ఖైదు చేశాడు. 12 సంవత్సరాల కారాగారవాసం తర్వాత తానీషా ఆ ఖైదులోనే మరణించాడు. హిందూరాజులు దేవాలయాలను ధ్వంసం చేయటం, ఔరంగజేబు మసీదుని ధ్వంసం చేయటం ఈ చర్యలన్నీ, మధ్యయుగాల్లో ప్రార్థనా స్థలాల ధ్వంసాలకు మత విద్వేషాలు కారణం కాదనీ, సంపద లేదా ధనం కారణం అనీ నిర్ద్వందంగా నిరూపిస్తున్నాయి.

**స్వాతంత్రోద్యమానికి ఆర్.ఎస్.ఎస్. దూరం:**

ముస్లిం వ్యతిరేక మతోన్మాద కార్యక్రమం తప్ప, బ్రిటిష్ వ్యతిరేక జాతీయ పోరాటం ఆర్.ఎస్.ఎస్. ఎజెండాలో ఎప్పుడూ లేదు. హిందూత్వ పితామహుడు సావర్కార్, ఆర్.యస్.యస్.కు ఉదార వాద ముసుగు అయిన వాజ్‌పాయ్‌లు తప్ప సంఘ్ పరివార్ నాయకులెవ్వరూ స్వాతంత్రోద్యమంలో పాల్గొనలేదు. భగత్‌సింగ్, అష్ఫఖుల్లాఖాన్ లాంటి వాళ్ళు ఉరికంబం ఎక్కబోయే ముందు కూడా బ్రిటిష్ వాళ్ళను ధిక్కరిస్తూ నినాదాలు చేశారు. కానీ సావర్కార్, వాజ్‌పాయ్‌లు మాత్రం బ్రిటిష్ వాళ్ళ ముందుసాగిల పడ్డారు.

నాసిక్‌లో జాక్సన్ అనే బ్రిటిష్ అధికారిని చంపటానికి ఉపయోగించిన ఆయుధాలు విప్లవకారులకు సావర్కార్ ద్వారా అందాయనే అభియోగం కింద అతనికి 1911లో యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్ష విధించి, అండమాన్ జైలుకు తరలించారు. ఆయుధాలు సరఫరా చేశాడనే అభియోగం, బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలదోయమని ప్రచారం చేశాడనే ఆరోపణ తప్ప, సావర్కార్ ప్రత్యక్ష పోరాటంలో పాల్గొన్నాడని బ్రిటిష్‌వాళ్ళు కూడా ఎక్కడా అనలేదు.

జైలుకెళ్ళి కనీసం ఒక సంవత్సరం కూడా గడవకముందే, క్షమా బిక్ష ప్రసాదించమని సావర్కార్ 1911లోనే బ్రిటిష్ ప్రభుత్వానికి లేఖ రాశాడు. తనకు

క్షమాభిక్ష ప్రసాదిస్తే చట్టబద్ధంగా నడుచుకుంటాననీ, తనలో వచ్చిన ఈ మార్పు భారతదేశంలోనూ, విదేశాల్లోనూ ఉన్న దారితప్పిన యువకులను తిరిగి దారిలో పెట్టటానికి ఉపయోగపడుతుందనీ, ప్రభుత్వానికి నచ్చిన సేవలు అందించటానికి తాను సర్వదా సిద్ధంగా ఉన్నానని కూడా లేఖలు రాశాడు. అతని క్షమాభిక్ష లేఖలకు సంతృప్తి చెందిన బ్రిటిష్‌వాళ్ళు 1921లో అతని మీద కొన్ని ఆంక్షలు విధించి, అండమాన్ జైలు నుండి విడుదల చేశారు. జైలు నుండి విడుదల అయినప్పటి నుండి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేదాకా కూడా సావర్కార్ బ్రిటిష్ వాళ్ళ తొత్తు లాగానే వ్యవహరించాడు.

1942 లో ఉధృతంగా సాగిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించాడు. గాంధీ చెప్పినట్లుగా ప్రభుతోద్యోగాలకు ఎవరూ రాజీనామాలు చెయ్యొద్దని ప్రచారం చేశాడు. సైన్యంలో చేరి బ్రిటిష్ వాళ్ళకు సేవలందించమని తన అనుచరులకూ, అభిమానులకూ పిలుపునిచ్చాడు. స్వాతంత్ర్యానంతరం గాంధీ హత్యకేసులో ముద్దాయిగా విచారణను ఎదుర్కొన్నాడు. అయితే సరైన సాక్ష్యాధారాలు లేవని కోర్టు భావించటంతో ఆ కేసు నుండి నిర్దోషిగా బయటపడ్డాడు. సంఘ్ పరివార్‌చే ఈ దేశపు ఉక్కు మనిషిగా కీర్తించబడుతున్న అప్పటి కేంద్ర హోం మంత్రి వల్లభాయ్ పటేల్ గాంధీ హత్య కేసు గురించి నెహ్రూకు 27-2-1948 న ఒక లేఖ రాశారు. ఆ లేఖలో "బాపూజీ హత్య కేసు పురోగతి గురించి ప్రతిరోజూ నేను తెలుసుకుంటున్నాను. సావర్కార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో బాపూజీ హత్యకు కుట్ర జరిగింది. అది అమలుపరచబడింది " అని పటేల్ పేర్కొన్నాడు.

బ్రిటిష్ వాళ్ళకు సాష్టాంగ నమస్కారాలు పెట్టి, క్షమాభిక్ష పొంది, వారు ఈ దేశం నుండి వెళ్ళిపోయే వరకూ వాళ్ళ సేవలో తరించి, ఈ జాతి పితగా పేరు గాంచిన గాంధీ హత్య కేసులో ముద్దాయిగా బోనులో నిలబడ్డ సావర్కార్‌ను గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడిగా సంఘ్ పరివార్ కీర్తిస్తున్నది. సంఘ్ పరివార్‌కు అనుబంధ సంస్థ అయిన బి.జె.పి. 2003 ఫిబ్రవరిలో సావర్కార్ చిత్రపటాన్ని పార్లమెంటులో కూడా ప్రతిష్ఠించింది.

క్విట్ ఇండియా ఉద్యమంలో వాజ్‌పాయ్ కూడా జైలుకెళ్ళారని సంఘ్ పరివార్ చరిత్రకారులు రాస్తున్నారు. ఏ కేసులో ఏ సందర్భంలో జైలుకెళ్ళాడనే వివరాలు మాత్రం రాయటం లేదు. ఒక అటవీ శాఖ కార్యాలయాన్ని ధ్వంసం

చేసిన కేసులో వాజ్‌పాయ్ విచారణను ఎదుర్కొన్నాడు. ఆ కేసులో వాజ్‌పాయ్ మేజిస్ట్రేట్ ముందు రాతపూర్వకమైన వాంగ్మూలం ఇచ్చాడు. తాను, తన అన్న బజార్లో నిలబడి ఉండగా లీలాధర్, ఇంకా కొంతమంది ఉద్యమకారులు రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చి, జనాన్ని అటవీ శాఖ కార్యాలయం పైకి దాడికి తీసుకెళ్ళారనీ, కేవలం కుతూహలం కొద్దీ తాము ఆ గుంపు వెనుక వెళ్ళామనీ, అటవీ శాఖ కార్యాలయ విధ్వంసంలో తమకు ఏ సంబంధం లేదనీ వాజ్‌పాయ్ ఆ వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఆ వాంగ్మూలాన్ని పరిగణన లోకి తీసుకున్న కోర్టు వాజ్‌పాయ్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. లీలాధర్‌కు మాత్రం 5 సం॥ల కఠిన కారాగార శిక్షను విధించింది. సంఘ్‌పరివార్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధులుగా పేర్కొంటున్న సావర్కార్, వాజ్‌పాయ్‌ల అసలు రంగు ఇది.

అంతే కాకుండా సంఘ్ పరివార్ గౌరవించే నాయకుల్లో ముఖ్యుడైన హిందూ మహాసభ నేత శ్యాం ప్రసాద్ ముఖర్జీ క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో ఫజల్ హక్ నాయకత్వంలో ఏర్పాటైన బెంగాల్ రాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్నాడు. ఈయన తన మంత్రి పదవికి రాజీనామా చేయకపోవటమే కాకుండా, క్విట్‌ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ 26-7-1942 న బ్రిటిషు ప్రభుత్వానికి ఒక లేఖ రాశాడు. బెంగాల్ ప్రావిన్సులో క్విట్ ఇండియా ఉద్యమాన్ని అణచివేయడానికి ఫజల్ హక్ నాయకత్వం లోని తమ ప్రభుత్వం చెయ్యాల్సిన అన్ని ప్రయత్నాలనూ చేస్తుందని ఆ లేఖలో నొక్కి వక్కాణించాడు. ఈ విధంగా సంఘ్ పరివార్ శక్తులు భారత జాతీయోద్యమంలో విద్రోహకర పాత్రను పోషించాయి.

క్విట్ ఇండియా ఉద్యమాన్ని కమ్యూనిస్టులు కూడా వ్యతిరేకించారు. సావర్కార్ వంటి హిందుత్వ శక్తులు వ్యతిరేకించటానికి కమ్యూనిష్టులు వ్యతిరేకించడానిక కారణాలు వేరువేరు అంతకు ముందెన్నడూ మానవ జాతి కనీ వినీ ఎరుగని భయంకరమైన నియంతృత్వాన్ని ఉనికిలోకి తెచ్చిన హిట్లర్‌తో పోరాడుతున్న బ్రిటన్‌ను ఆ సమయంలో చికాకు పెట్టటం భావ్యం కాదనే ఉద్దేశంతో కమ్యూనిస్టులు క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించారు. ముస్లింల కంటే బ్రిటిష్‌వాళ్లకు మేమే నమ్మకమైన మిత్రులమని విశ్వాసం కల్గించేందుకూ తద్వారా బ్రిటిష్ సామ్రాజ్యం నుండి ఎక్కువ ప్రయోజనాల్ని అందిపుచ్చుకునేందుకూ హిందుత్వశక్తులు క్విట్‌ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించాయి.

**జనగణమన రగడ:**

'జనగణమన' గీతాన్ని ఆర్.యస్.యస్. జాతీయ గీతంగా అంగీకరించ లేదు. 'వందేమాతరం' గీతాన్ని జాతీయ గీతంగా చెయ్యాలని వాళ్ళు పట్టుపట్టారు. ఇప్పుడు మనం పాడుకుంటున్న 'వందేమాతరం' పూర్తి గీతం కాదు. పూర్తి గీతంలోని ఒక చరణం ఈ విధంగా ఉంటుంది."త్వంహీ దుర్గ, దశ ప్రహర్షధరణి కమలాకమల దళ విహారిణీ వాణీ విద్యా దాయని నమామి త్వం." అంటే పది ఆయుధాలు పట్టిన దుర్గవు నీవే, పద్మదళములందు విహరించే లక్ష్మివి నీవే, విద్యాదాత్రి అయిన సరస్వతివి నీవే, తల్లీ నీకు నమస్కరిస్తున్నాము. ఈ గీతంలో హిందూ మత స్పర్శ ఉంది కాబట్టి దాన్ని జాతీయ గీతం గా చెయ్యమని వాళ్ళు రాద్ధాంతం చేసారు.

భూభాగానికి పవిత్రతనూ, దైవత్వాన్నీ ఆపాదించడమ్ కాదు హిందూ దేవత అవతారాన్ని ఆపాదించి, భూభాగమే గొప్పదని, ఆ భూభాగం కోసం ప్రజలు ఎన్ని త్యాగాలకయినా సిద్ధపడాలని ప్రబోధించే మత భావోద్రేకంతో కూడిన గీతాన్ని జాతీయ గీతంగా చెయ్యాలని ఈ హిందూ మతతత్వ శక్తులు డిమాండ్ చేశాయి.

జనగణమన గీతంలో భూభాగానికి దైవత్వం ఆపాదించలేదు. భిన్నత్వానికీ, భిన్న ప్రాంత ప్రజలకీ ఠాగూర్ పెద్ద పీట వేశాడు. 'పంజాబు సింధు, గుజరాత మరాఠా ద్రావిడ ఉత్కళ వంగా! తవ శుభనామే జాగే, తవశుభ ఆశిషమాగే' (ఆ ప్రాంతాలన్నీ శుభప్రదమైన దీవెనలు అడుగుతున్నాయి.నీ నామాన్నే పాడుతున్నాయి.) ఆయా ప్రాంతాల్లోని ప్రజలు కలిస్తేనే భారతదేశం అని, విభిన్నత్వమే భారతదేశం ప్రాధమిక లక్షణమనీ, భూభాగం కంటే ప్రజలకే ప్రాధాన్యం ఇవ్వాలన్న సందేశం ఆ గీతంలో ఉంది.

హిందూత్వ శక్తులు, కమ్యూనిస్టులు ఇద్దరూ ఆ గీతాన్ని జాతీయ గీతంగా ఆమోదించటాన్ని వ్యతిరేకించారు. బ్రిటిషు యువరాజు భారతదేశ సందర్శన సందర్భంగా ఆయనను పొగుడుతూ రాసిన గీతమనీ, అది బానిస మనస్తత్వానికి ప్రతీక అనీ విమర్శించారు. ఆ గీతంలోని 'భారత భాగ్య విధాతా' అనే పదబంధాన్ని డెస్టినీ ఆఫ్ గాడ్ అనే ఉద్దేశంతో రాశాననీ, బ్రిటిష్ యువరాజును దృష్టిలో పెట్టుకొని కాదనీ, అధికార స్థానాల్లో ఉన్న తన మిత్రులు బ్రిటిష్ రాణిని పొగుడుతూ గీతాలు రాయమని అనేక మార్లు అడిగినప్పటికీ తాను దృఢంగా వ్యతిరేకించాననీ, ఈ

విషయాలను తనే స్వయంగా చెప్పుకోవాల్సి రావటం తన దౌర్భాగ్యమనీ ఠాగూర్ ఆక్రోశించాడు. తాము తప్ప మిగతావాళ్లందరూ సామ్రాజ్యవాద వ్యతిరేకులు కారు అనే ఉద్దేశ్యంతో కమ్యూనిస్టులూ, హిందుమతానికి పెద్దపీట వేయలేదని హిందూత్వ శక్తులు ఠాగూర్ రాసిన జనగణమన గీతాన్ని వ్యతిరేకించారు.

**జెండానూ ఆమోదించలేదు:**

అంతే కాకుండా 2002 వరకు కూడా మూడు రంగుల జాతీయ జెండాను ఆర్.యస్.యస్. గౌరవించలేదు. తమ శాఖా సమావేశాల్లో ఎగుర వేసే హిందూ మత ప్రతీక అయిన కాషాయ రంగు జెండాను మాత్రమే జాతీయ జెండాగా నిర్ణయించాలని ఆర్.యస్.యస్. కోరింది. క్రిస్టియానిటీకి ప్రతీక అయిన తెలుపు రంగుకూ, ఇస్లాంకు ప్రతీక అయిన ఆకుపచ్చ రంగుకూ, బౌద్ధమతావలంబి అయిన అశోకుని ధర్మచక్రానికీ జాతీయ జెండాలో చోటు కల్పించటాన్ని సహించలేక పోయింది. ఆర్.యస్.యస్. అధికార పత్రిక అయిన ఆర్గనైజర్ 14-8-1947 నాటి సంపాదకీయంలో - ఇలా రాసింది.

“విధి అనుకూలించటం మూలంగా అధికారంలోకి వచ్చిన వాళ్ళు మన చేతులకు మూడు రంగుల జెండా ను ఇవ్వబోతున్నారు. కాని హిందువులు ఎన్నటికీ ఆ జెండా ను స్వంతం చేసుకోవటం కానీ, గౌరవించటం కానీ జరగదు. మూడు అంటేనే ముదనష్టం. మూడు రంగుల జెండా తప్పనిసరిగా దేశానికి కీడు కలుగచేస్తుంది.”

ఈ విధంగా వారు జాతీయ జెండా పట్ల తమ అయిష్టత నూ, ద్వేషాన్నీ వ్యక్త పరిచారు.

మహాత్మాగాంధీ హత్య జరిగిన కొద్ది రోజులకే ఆర్.యస్.యస్. కార్యకర్తలు జాతీయ జెండాను పలుప్రాంతాల్లో కాళ్ళతో తొక్కి అగౌరవపరుస్తున్నారని విస్తృతంగా ఫిర్యాదులు వచ్చాయి. దాని గురించి నెహ్రూ తీవ్రంగా కలత చెందాడు. 24-2-1948 న నెహ్రూ తన ప్రసంగంలో ఈ విషయం గురించి బాధపడుతూ ‘జాతీయ జెండాను అగౌరవ పరచటమంటే తమను తాము దేశద్రోహులుగా ప్రకటించుకోవటమే’ నని ఆర్.యస్.యస్. ను ఉద్దేశించి అన్నాడు.

2001 జనవరి 26న రాష్ట్ర ప్రేమి యువదళ్ అనే సంస్థకు చెందిన ముగ్గురు యువకులు నాగపూర్ లోని ఆర్.యస్.యస్. ప్రధాన కార్యాలయం లోకి ప్రవేశించి, ఆ కార్యాలయంపైన జాతీయ జెండాను ఎగరేశారు. దానికి ఆర్.యస్.యస్. కార్యకర్తలు వాళ్ళను కొట్టి, పోలీసులకప్పగించి, వాళ్ళ మీద కేసులు బనాయించారు. ఆ ముగ్గురు యువకులూ ఆ కేసులో 12 సంవత్సరాల పాటు కోర్టు చుట్టూ తిరిగారు. తగిన సాక్ష్యాధారాలు లభించక పోవటంతో కోర్టు ఆ కేసును చివరికి 2013 లో కొట్టివేసింది. అన్ని కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో జాతీయ జెండాను తప్పనిసరిగా ఎగరవేయాలని ఆజ్ఞలు జారీ చేయటం గొప్ప దేశభక్తి కార్యక్రమంగా ఇప్పుడు డబ్బాలు కొట్టుకుంటున్న సంఘ్ పరివార్ 2001 వరకూ మూడురంగుల జెండాను జాతీయ జెండాగా ఏ మాత్రం అంగీకరించలేదు. "జాతీయ జెండా ఎగురవేయటాన్ని అడ్డుకున్న ఆర్.యస్.యస్." అనే శీర్షికతో మీడియాలో వార్తలు వస్తే, తన హిందూత్వ జాతీయవాద రాజకీయాలను ముందుకు తీసుకుపోవటం సాధ్యం కాదని గ్రహించుకున్న తర్వాత, 2002 నుండి మాత్రమే ఆర్.యస్.యస్. జాతీయ జెండాను తన కార్యాలయాలపై ఎగురవేయటం ప్రారంభించింది.

మహాత్మాగాంధీ హత్యానంతరం తమపై విధించిన నిషేధాన్ని ఎత్తి వేయాలని ఆర్.ఎస్.ఎస్. నాయకులు అప్పటి హోం మంత్రి సర్దార్‌పటేల్‌ను కోరారు. పటేల్ దానికి కొన్ని షరతులు విధించారు. మూడు రంగుల జెండాను జాతీయ జెండాగా ఆర్.ఎస్.ఎస్.కూడా అంగీకరించాలనేది ఆ షరతుల్లో ఒకటి. ఆర్.ఎస్.ఎస్. ఆ షరతుకు అంగీకరించింది.

అంతే కాకుండా అధికారం కోసం బి.జె.పి, సంఘ్‌పరివార్ శక్తులు అడుగడుగునా పక్కా అవకాశవాదం ప్రదర్శించాయి. తమ పునాది సిద్ధాంతాలను, నినాదాలను కూడా ఓట్ల కోసం కాసేపు పక్కనపెట్టాయి. భారతీయ సంస్కృతి గురించి వివరించటానికి భిన్నత్వంలో ఏకత్వం అనే భావనను అందరూ వాడతారు. కానీ భారతీయ సంస్కృతిలో భిన్నత్వం ఉన్నంత విస్తారంగా ఏకత్వం లేదు. సంఘ్ పరివార్ ఎజెండా అమలు పరచటానికి భారతీయ సమాజంలో ప్రబలంగా ఉన్న ఈ భిన్నత్వమే అడ్డుపడుతోంది. సంఘపరివార్ శక్తులు ప్రచారం చేసిన ప్రముఖ నినాదం హిందీ, హిందూ, హిందూస్థాన్.

సంఘ్‌పరివార్, కాంగ్రెస్ రెండూ కూడా హిందీని దేశప్రజల భాషగా, అధికార భాషగా చెయ్యటానికి ప్రయత్నించాయి. ఊరూరా హిందీ ప్రేమ మండళ్లను స్థాపించి, హిందీ యేతర రాష్ట్రాల ప్రజలు హిందీని కూడా స్వచ్ఛందంగా తమ భాషగా స్వంతం చేసుకోవాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ కృషి చేసింది.

**సంఘ్‌పరివార్ అవకాశవాదం:**

హిందీని అధికార భాష చేసి హిందీయేతర రాష్ట్రాల మీద రుద్దాలని సంఘ్‌పరివార్ శక్తులు డిమాండ్ చేశాయి. హిందీయేతర రాష్ట్రాల నుండి తీవ్ర ప్రతిఘటన రావటంతో అప్పటి జాతీయ నాయకులు హిందీని జాతీయ భాషగా గాని, అధికార భాషగా గాని రాజ్యాంగంలో పేర్కొనలేదు. హిందీతో సహా మొత్తం 22 భాషలనూ అధికార భాషలుగా పేర్కొన్నారు. ఒక భాషను ఎక్కువచేసి ఇంకో భాషను తక్కువ చేయకుండా అన్ని భాషలకూ సమాన హోదాను కల్పించారు. హిందీని అధికార భాష చెయ్యాలని స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సంఘ్‌పరివార్ శక్తులు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. 1960వ దశాబ్దంలో హిందీ భాషను తమ మీద రుద్దటాన్ని నిరసిస్తూ దక్షిణాది రాష్ట్రాల నుండి ముఖ్యంగా తమిళనాడు నుండి తీవ్ర నిరసనలు పెల్లుబికాయి. దాంతో నెహ్రూ ప్రభుత్వం వెనక్కితగ్గి హిందీని దక్షిణాది రాష్ట్రాల మీద రుద్దటాన్ని ఆపివేసింది. ఆ ఉద్యమాన్ని గమనించిన సంఘ్‌పరివార్‌కు జ్ఞానోదయమయింది. హిందీని అధికార భాషగా చెయ్యాలన్న తమ డిమాండ్‌ను వదులుకోకపోతే దక్షిణాది రాష్ట్రాల్లో తమకు పుట్టగతులుండవని గ్రహించింది.

అప్పటి నుంచి హిందీ అధికార భాషగా ఉండాలనే డిమాండ్‌ను వదిలి పెట్టింది. రాజకీయ అధికారం చేజిక్కించుకోవటం కోసం మెజారిటీ ప్రజల ఓట్లు సంపాదించటానికే ఈ అవకాశవాద వైఖరిని అడుగడుగునా అవలంబించాయి.

1980 లో భారతీయ జనతాపార్టీ ఏర్పడినప్పటి నుండి మూడు ప్రధాన డిమాండ్లను ప్రచారంలోకి తెచ్చింది. అవి –

ఒకటి: బాబ్రి మసీదుని కూలగొట్టి రామమందిరాన్ని నిర్మించాలి

రెండు: కాశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 ని రద్దు చెయ్యాలి.

మూడు: యూనిఫామ్ సివిల్ కోడ్‌ని (ఉమ్మడి పౌరచట్టాన్ని) అమలులోకి తీసుకురావాలి.

తమకు మద్దతు  ఇస్తున్న మిత్రపక్షాలు దూరమైతే, తమ పార్టీలోనే అంతర్గత అసమ్మతి తలెత్తి, తద్వారా అధికారాన్ని కోల్పోతామనే భావంతో 2014 లో తనకు పూర్తి మెజారిటీ వచ్చినా బి.జె.పి రామమందిర నిర్మాణాన్ని చేపట్టటానికి సాహసించలేదు.

అలాగే జమ్ము కాశ్మీరు ప్రభుత్వంలో భాగస్వామి కావటానికి 370 ఆర్టికల్‌ను రద్దు చెయ్యాలనే డిమాండ్‌ను పక్కనపెట్టి టి.డి.పి.తో చేతులు కలిపి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

వివాహ వారసత్వం వంటి విషయాల్లో లింగ వివక్షను వ్యతిరేకిస్తూ స్త్రీలకు కూడా పురుషులతో సమాన అవకాశాలు కల్పిస్తూ ప్రధమ భారత న్యాయశాఖమంత్రిగా అంబేద్కర్ ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లును సంఘ్‌పరివార్ శక్తులు వ్యతిరేకించినంతగా, వేరే ఎవరూ వ్యతిరేకించలేదు.

**కామన్ సివిల్ కోడ్ డిమాండ్:**

1956 కి ముందు హిందువులలో కూడా బహు భార్యత్వం చట్ట సమ్మతమే. హిందూ పురుషులు వందమంది స్త్రీలను పెళ్లి చేసుకున్నా చట్ట వ్యతిరేకం కాదు. 1956లో హిందూ పురుషుల వివాహ చట్టంలో వచ్చిన సంస్కరణల మూలంగా, మొదట భార్య ఉండగానే మరో పెళ్లి చేసుకొనే అవకాశం హిందువులకి నిరాకరించబడింది. నచ్చని భార్యకి తన ఇష్టానుసారం విడాకులు ఇవ్వటానికి 2హిందూ పురుషులకు చట్ట ప్రకారం అవకాశం లేదు.

ముస్లిం పురుషులకి మాత్రం ఏక కాలంలో నలుగురు భార్యల్ని కలిగి ఉండే అవకాశం, తనకు నచ్చని భార్యకి 'తలాఖ్' చెప్పటం ద్వారా విడాకులు ఇచ్చే సౌలభ్యం చట్ట ప్రకారమే ఉంది.

దేశ విభజన మూలంగా ఆస్తుల్ని ఉర్దూ భాషను పోగొట్టుకొని ఈ దేశంలో పరాయివాళ్లం అనుకుంటూ ముస్లింలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఆ సమయంలో ముస్లింల ఆచార వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే వాళ్ళు మరింత దూరమవుతారనే భావంతో అప్పటి ప్రభుత్వాలు ముస్లింల వ్యక్తిగత చట్టాలను మార్చటానికి ఇవ్వలేదు.

ఎక్కువ మంది స్త్రీలను పెళ్ళి చేసుకునే అవకాశం, ఇష్టం వచ్చినట్టు విడాకులు ఇచ్చే వెసులుబాటు తమకు కూడా లేకపోయిందనే దుగ్ధ హిందూ పురుషుల్లో తలెత్తింది. తమకు లేని అవకాశాలు ముస్లిం పురుషులకి ఉండటానికి వీల్లేదనే ఉద్దేశ్యంతో హిందూ పురుషులు బిజెపి ప్రవచిస్తున్న కామన్ సివిల్ కోడ్‌కు మద్దతు ఇవ్వనారంభించారు.

కామన్ సివిల్ కోడ్ ప్రవేశపెడితే బహు భార్యత్వం, తలాక్ పద్ధతిలో విడాకులే కాకుండా ఆస్తి వారసత్వం వంటి అన్ని విషయాల గురించి ఒకే చట్టం చేయాల్సి వస్తుంది. కాని కుటుంబ వ్యవహారాలు, ఆస్తి వ్యవహారాలకు సంబంధించి వివిధ సమూహాలకు ఆచార వ్యవహారాలు వేరువేరుగా ఉంటాయి. ఒకే ఉమ్మడి పౌరచట్టం తెస్తే మెజారిటీ ప్రజలైన హిందువుల ఆచార వ్యవహారాలకు మనోభావాలకు పెద్దపీట వెయ్యాల్సి ఉంటుంది. అలా చేస్తే హైందవేతర సమాజాలన్నీ బిజెపికి వ్యతిరేకమవుతాయి.

కాబట్టి ఉమ్మడి పౌరచట్టాన్ని పక్కనపెట్టి, ఇప్పుడు తలాక్ పద్ధతిలో విడాకులు ఇవ్వడాన్ని మాత్రమే నిషేధించారు. తద్వారా తమకు లేని అవకాశం ముస్లిం పురుషులకు కూడా ఉండకూడదనే హిందూ పురుషుల అహాన్ని సంతృప్తి పరిచారు.

బిజెపి పడుతున్న ఈ విధమైన రాజీలను హిందుత్వ తీవ్ర ఛాందసవాద శక్తులు ఇప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. అడపాదడపా మోడీని బహిరంగంగానే విమర్శిస్తున్నాయి. కాని మోడీని మరింత బలోపేతం చెయ్యకపోతే సంఘ్‌పరివార్ శక్తులకు మొత్తం మీద నష్టం వాటిల్లుతుందని ఆర్.ఎస్.ఎస్. అగ్ర నాయకత్వం, హిందూత్వ తీవ్ర ఛాందస వాదాలకు నచ్చచెపుతూ సంఘ్‌పరివార్‌లోని వివిధ భావజాలాలను జాగ్రత్తగా సమన్వయం చేస్తూ వస్తోంది.

'సిద్ధాంతాలను పక్కనపెట్టి అయినా అధికారంలోకి రావాలి. వచ్చిన తరువాత బాగా దూకుడుగా తమ సిద్ధాంతాలను అమలు చేసుకోవటానికి అనువయిన పరిస్థితులను కల్పించుకోవాలి. రెండడుగులు ముందుకు వెయ్యటానికి ఒక్కో సందర్భంలో ఒక అడుగు వెనక్కి వెయ్యాల్సి ఉంటుంది.' అనే సూత్రాన్ని సంఘ్‌పరివార్ అనుసరిస్తున్నది.

**ఆర్థిక వాదంతోనూ అవకాశవాదం:**

స్వయం పోషకమైన ఆర్థిక విధానం భారతదేశానికి ఉండాలన్నది సంఘపరివార్ సిద్ధాంతం. సంఘ్‌పరివార్ మార్గదర్శకుడైన దీనదయాళ్ ఉపాధ్యాయ అదే బోధించాడు. ఆర్థికాభివృద్ధి పేరుతో పి.వి. నరసింహారావు ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానాలను సంఘ్‌పరివార్ తీవ్రంగా వ్యతిరేకించింది. విదేశీ వస్తువుల్ని మొదట విదేశీ సంస్థల్ని బహిష్కరించాలని పిలుపునిస్తూ స్వదేశీ జాగరణ మంచ్ అనే సంస్థను స్థాపించి పలు కార్యక్రమాలు చేపట్టింది. కాని ఇప్పుడు భారత దేశాన్ని అగ్ర రాజ్యాల సరసన నిలబెడతాననే పేరుతో మోదీ అనుసరిస్తున్న బహుళజాతి కంపెనీలకు అనుకూలమైన ఆర్థిక విధానాలను, అంతకుముందు ఏ ప్రభుత్వమూ కల్పించనన్ని సౌకర్యాలను (బహుళజాతి కంపెనీలకు) కల్పించటాన్నీ సంఘ్‌పరివార్ శక్తులు ఏ మాత్రం వ్యతిరేకించటం లేదు.

'స్వదేశీ జాగరణ మంచ్' అనే సంస్థను అధికారికంగా రద్దు చేసుకోకపోయినా అనధికారికంగా రద్దయిపోయింది.

**బీఫ్ రాజకీయం:**

పశుమాంసం (ముఖ్యంగా ఆవుమాంసం) తినటాన్ని వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా ప్రచారం మొదలు పెట్టారు. పశుమాంసం (బీఫ్) కలిగి ఉన్నారని అనుమానం కలిగిన వారిపై దాడిచేసి చంపటానికి కూడా సంఘ్‌పరివార్ శక్తులు వెనుకాడలేదు. భిన్నమైన ఆహారపు అలవాట్లు కలిగి ఉన్నవారిని చంపటాన్ని సమర్థిస్తూ సంఘ్‌పరివార్ మేధావులు ప్రకటనలు కూడా ఇచ్చారు. ఆ కేసులనుంచి బయటపడటానికి హంతకులకి రక్షణ కమిటీలను సైతం ఏర్పాటు చేశారు.

ఈశాన్య రాష్ట్రాల్లో మెజారిటీ ప్రజలు తమ రోజువారీ ఆహారంలో భాగంగా పశుమాంసాన్ని (బీఫ్‌ని) తింటారు. బీఫ్ తినటాన్ని వ్యతిరేకిస్తే ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఓటును కోల్పోవాల్సి వస్తుంది కాబట్టి 'బీఫ్' తినటానికి తాము వ్యతిరేకులం కాదని ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో ప్రచారం చేశారు.

అలాగే మాతృభాషలో విద్యాబోధనకు ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని, ఆంగ్ల భాషలో విద్యాబోధన చేసే స్కూళ్లకు ప్రభుత్వం గ్రాంట్‌లు ఇవ్వరాదని సంఘ్‌పరివార్ శక్తులు ఎప్పటినుంచో ప్రచారం చేస్తున్నాయి. గోవాలో కూడా అలాంటి డిమండే పెట్టింది. ఇంగ్లీషు మీడియం పాఠశాలలకు ప్రభుత్వాలు గ్రాంట్‌లు ఇస్తున్నాయి.

ఆ స్కూళ్లల్లో క్రిష్టియన్ విద్యార్థుల కంటే నిజానికి హిందూ విద్యార్థులే మెజారిటీగా ఉంటారు. అయితే ఆ స్కూళ్లకు ప్రభుత్వం గ్రాంట్‌లు ఇవ్వకూడదనీ, గ్రాంట్‌లు ప్రకటించని పార్టీకే ఓట్లు వేయాలనీ గోవాలోని ఆర్.ఎస్.ఎస్ శాఖ ఆందోళనల్ని మొదలు పెట్టింది. కానీ బిజెపి ఆ డిమాండ్‌ను తోసిపుచ్చింది. ఎందుకంటే ఆ స్కూళ్లలో చదివే హిందూ విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని భయపడింది. తాము అధికారంలోకి ఇంగ్లీష్ మీడియం స్కూళ్లకు కూడా గ్రాంట్‌లు కొనసాగిస్తామని వాగ్ధానం చేసింది.

పై ఉదంతాలను బట్టి బిజెపికి రాజకీయ అధికారమే ముఖ్యం కానీ సిద్ధాంతాలు కావని అర్థమవుతుంది.

**రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం:**

జాతీయోద్యమ విలువలకు అక్షర రూపం భారత రాజ్యాంగం. కాని సంఘ్ పరివార్ రాజ్యాంగాన్ని కూడా వ్యతిరేకిస్తూ ఉన్నది. ఆర్గనైజర్ పత్రిక 30-11-1949 వ తేదీ గల సంచికలో రాసిన సంపాదకీయంలో ఈ విధంగా అభిప్రాయపడింది.

"ఏ దేశంలో జరుగని విధంగా ప్రాచీన భారత దేశంలో రాజ్యాంగ సూత్రాల అభివృద్ధి జరిగింది. కాని దాన్ని గురించిన ప్రస్తావన మన రాజ్యాంగం లో లేదు. మనుస్మృతిలో పొందుపర్చబడిన సూత్రాలను ప్రపంచం ఈనాటికీ ప్రశంసిస్తూనే ఉంది. ప్రజలు కూడా అసంకల్పితంగా వాటినే పాటిస్తున్నారు. ఆమోదిస్తున్నారు. కాని మన రాజ్యాంగ పండితులకు (అంబేద్కర్ అని వాళ్ళ భావన) మాత్రం అవి ఎందుకూ కొరగానివయ్యాయి".

1992 డిసెంబరు లో వి.హెచ్.పి. నిర్వహించిన ధర్మ సంసద్ "భారత రాజ్యాంగం హిందువులకు వ్యతిరేకంగా ఉన్నదనీ, దాని స్థానం లో హిందూ రాజ్యాంగాన్ని రూపొందించుకోవాలనీ" తీర్మానించింది. మనుస్మృతి లో గొప్ప సమతా ధర్మమున్నదనీ, భారత రాజ్యాంగం కన్నా అదెంతో ఉన్నతమైనదనీ ప్రకటించింది.

2000వ సం॥లో కూడా అప్పటి ఆర్.యస్.యస్. అధినేత సుదర్శన్ ఓ సమావేశంలో మాట్లాడుతూ "భారత రాజ్యాంగ రచన భారతీయ విలువల ప్రకారం జరగలేదు. విదేశీ విలువల ఆధారంగా జరిగింది. ఈ రాజ్యాంగాన్ని

విసిరేసి, మన పవిత్ర గ్రంథాలలోని విలువల ప్రాతిపదిక గా కొత్త రాజ్యాంగాన్ని రచించుకోవాలి" అని అన్నాడు. వాజ్‌పాయ్ హయాంలో రాజ్యాంగ సమీక్షకు ఒక కమిటీ వేశారు. ప్రజాభిప్రాయం రాజ్యాంగాన్ని మార్చటానికి వ్యతిరేకంగా వుందని గుర్తించే ఆ ప్రయత్నాన్ని వాయిదా వేసుకున్నారు. కాని ఎప్పటికైనా రాజ్యాంగాన్ని మార్చటం వాళ్ల లక్ష్యం. అంబేద్కర్ మాటలను సందర్భ శుద్ధి లేకుండా ఉటంకిస్తూ తమ మతోన్మాదంలోకి దళితులను కూడా లాగటానికి ఆమన్ని సంఘ్‌పరివార్ శక్తులు ఇప్పటికే ఉపయోగించుకుంటున్నాయి.

వర్ణాశ్రమ ధర్మాలను, తద్వారా కుల వ్యవస్థను సమర్థించే వేదాలు, భగవద్గీత, మనుస్మృతి లాంటి గ్రంథాలను మాత్రమే సంఘ్ పరివార్ పవిత్ర గ్రంథాలుగా ఆమోదిస్తుంది. వాటిని వ్యతిరేకించే త్రిపిటికాలు లాంటి బౌద్ధ గ్రంథాలనూ, గురుగ్రంథ్ సాహెబ్ లాంటి సిక్కు గ్రంథాలనూ పవిత్ర గ్రంధాలు గా వాళ్ళు ఒప్పుకోరు. భారతీయ విలువలంటే వాళ్ళ దృష్టిలో మనుస్మృతిలో పొందుపర్చబడ్డ విలువలే. ఆ విలువల ప్రాతిపదికన రాజ్యాంగాన్ని లిఖించటానికి రాజ్యాంగ సమీక్ష జరపాలనే డిమాండును సంఘ్ పరివార్ ముందుకు తీసుకొస్తూ ఉంది. బలహీన వర్గాలకు రాజ్యాంగం ఒక హక్కుగా ప్రసాదించిన రిజర్వేషన్ విధానాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందని ప్రస్తుత ఆర్.యస్.యస్. అధినేత మోహన్ భగవత్ లోగడ బీహార్ ఎన్నికల సందర్భంగా పత్రికా ముఖంగా ప్రకటించారు.

జాతీయోద్యమంలో ముందుకు వచ్చిన ఆధునిక విలువలను భారతీయ సంస్కృతిగా అంగీకరించకపోతే ఈ దేశంలో ఉన్న ఉమ్మడి సంస్కృతి ఏమిటి అనే ప్రశ్నకు సంఘ్ పరివార్ జవాబు చెప్పాలి. ఈశాన్య రాష్ట్రాల్లో తప్ప, మిగతా భారతదేశమంతా వ్యాపించి ఉన్న ఉమ్మడి సంస్కృతి కులవ్యవస్థే. అది తప్ప భారతదేశం అంతటా ఉన్న ఉమ్మడి సంస్కృతి మరొకటి లేదు. కులవ్యవస్థను సైద్ధాంతికంగా ఒప్పుకోని బౌద్ధ, సిక్కు, ఇస్లాం, క్రిస్టియన్ మతాల్లోకి కూడా అది ఇక్కడ చొరబడగలిగింది. ఆధునిక విలువల్ని పక్కన పెడితే ఈ దేశంలో మిగిలేది కుల సంస్కృతి మాత్రమే. ఆ సంస్కృతినే చెక్కు చెదరకుండా కాపాడు కోవాలని సంఘ్ పరివార్ అంటున్నది. ఈవిషయాలను సూటిగా, స్పష్టంగా చెపితే రాజకీయంగా తీవ్రమైన నష్టం కలుగుతుంది కాబట్టి, సాంస్కృతిక జాతీయ వాదం అనే ముద్దుపేరుతో సంఘ్ పరివార్ దాన్ని మన ముందుకు తెస్తున్నది.

కులాంతర వివాహాలను ముఖ్యంగా దళిత పురుషులు, అగ్రవర్ణ స్త్రీలు ప్రేమించి పెళ్ళిళ్ళు చేసుకోవటాన్ని సంఘ్‌పరివార్ ఆమోదిస్తుందా? ఈ విషయమై మీ వైఖరి ఏంటని నిలదీస్తే వారి డొల్లతనం బయటపడుతుంది. సాంస్కృతిక జాతీయవాదంలోని అగ్రకుల తత్వం అర్థమౌతుంది. గత పది సంవత్సరాలలో అగ్రకుల స్త్రీలను ప్రేమించి పెళ్లి చేసుకున్న సుమారు 85 మంది దళిత యువకులు తమిళనాడులో అగ్రకులాల వారి చేత దారుణంగా చంపబడ్డారు. ఉత్తర భారతదేశంలో కూడా చాలా పరువుహత్యలు జరిగాయి. సంఘ్ పరివార్ కానీ, బిజెపి కానీ పరువు హత్యల్ని వ్యతిరేకిస్తూ ఇంతవరకు ఒక మాట కూడా మాట్లాడలేదు. ప్రైవేట్‌గా వాళ్లు పరువు హత్యల్ని సమర్థిస్తూనే ఉన్నారు. హిందూ స్త్రీలను పెళ్లి చేసుకున్న ముస్లిం పురుషుల్ని చంపటానికి సంఘ్ పరివార్ శక్తులు ప్రవేశపెట్టిన 'లవ్ జిహాద్' అనే భావనను ఇప్పుడు దళిత యువకుల్ని చంపడానికి అగ్రకులాలు కూడా ఉపయోగించుకుంటున్నాయి.

కులాంతర, మతాంతర వివాహాల్ని అడ్డుకోవటం, వర్ణ సంకరం కాకుండా అగ్రకుల హిందువుల 'పవిత్రత'ను కాపాడటం, ప్రేమించటాన్ని నిషేధించి ప్రేమికుల మీద భౌతిక దాడులకు పాల్పడటం అనేవి సంఘపరివార్ చేపట్టిన లవ్ జిహాద్ వ్యతిరేకోద్యమ అసలు లక్ష్యాలు.

ప్రేమ అనేది తమ మీద తిరుగుబాటుగా, విప్లవంగా తల్లిదండ్రులు మాత్రమే కాకుండా కులాలు మతాలు కూడా భావిస్తున్నాయి. కులాంతర, మతాంతర ప్రేమలను తీవ్రంగా అణచివేసే ప్రయత్నం చేస్తున్నాయి. పరువు హత్యలకు పాల్పడుతున్నారు. మతాలకు కులాలకు లోబడి మాత్రమే ప్రేమించే స్వేచ్ఛ పెళ్లి చేసుకునే స్వేచ్ఛ ఉండాలని శాసిస్తున్నారు. ఇటీవల తెలుగు రాష్ట్రాలలో జరిగిన హత్యలు కూడా దీనికి ఉదాహరణ. ప్రేమయుద్ధం – (లనే జిహాద్) పేరుతో ప్రేమికులను నిర్దాక్షిణ్యంగా చంపేసే ఆటవిక చర్యలకు పాల్పడుతున్నారు.

**జన సంఘ్ ఆవిర్భావం:**

గాంధీజి హత్య జరిగేంతవరకూ ఆర్.యస్.యస్. తమకొక రాజకీయ పార్టీ అవసరమన్న విషయాన్ని గుర్తించలేదు. ప్రజాస్వామ్యంలో మెజారిటీ ఓట్లే నిర్ణయాత్మకం కాబట్టి, ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా సమాజంలో వేళ్ళూనుకొని పోయిన సంస్కృతికి లోబడే పరిపాలన సాగుతుంది. మెజారిటీ

ప్రజల సంస్కృతిని తమ రాజకీయ అవసరాల కోసం వాడుకోవటానికి రాజకీయ పార్టీలు వెంపర్లాడతాయే తప్ప ఆ సంస్కృతి లోని అప్రజాస్వామిక అంశాలను మార్చటానికి సాహసించవు. ప్రజల సెంటిమెంటుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఓట్లు కోల్పోతామనే భయం ఉంటుంది. అందుకే బ్రాహ్మణీయ విలువలతో కూడిన హిందూ సంస్కృతిని ఈ దేశం లో ప్రబలంగా వ్యాపింప చేస్తే చాలుననీ, ప్రత్యేకంగా తమకంటూ ఓ రాజకీయ పార్టీని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం లేదనీ ఆర్.యస్.యస్. భావించింది.

గాంధీ హత్యానంతరం తన మీద నిషేధం విధిస్తే పార్లమెంట్‌లో కానీ, బయట కానీ నిషేధానికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడక పోవటంతో ఆర్.యస్.యస్.కు రాజకీయ పార్టీ అవసరం, ఇతర అనుబంధ సంఘాల అవసరం తెలిసి వచ్చింది. దానితో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలనే తన విధానాన్ని మార్చుకుంది. 1951లో హిందూ మహాసభతో చేతులు కలిపి జన సంఘ్ పార్టీని ఏర్పాటు చేసింది. అన్ని తరగతుల ప్రజా సమూహాల్లో పని చెయ్యటానికి వీలుగా అనుబంధ సంస్థల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం ఆర్.యస్.యస్.కు ఉన్నన్ని అనుబంధ సంస్థలు భారతదేశంలోని ఏ పార్టీకీ, ఏ సంస్థకూ లేవు.

సంఘ్ పరివార్ భావజాలాన్నంతా క్రోడీకరించి అప్పటి జన సంఘ్ పార్టీ అధ్యక్షుడయిన దీనదయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మతా మానవతా వాదం అనే సిద్ధాంతాన్ని తయారు చేశాడు. జన సంఘ్ తర్వాత కాలంలో దాని స్థానంలో వచ్చిన బి.జె.పి.లు ఆ సిద్ధాంతాన్ని తమ ప్రాపంచిక దృక్పథంగా స్వీకరించాయి. క్లుప్తంగా చెప్పుకుంటే ఆ సిద్దాంతం ఈ విధంగా ఉంటుంది.

"సమాజాన్ని మనుషులు తయారు చెయ్యలేదు. అది స్వయంభువు. తనంతట తానే ఉనికి లోకి వచ్చింది. పుట్టుకతోనే మానవశరీరంలో వివిధ అవయవాలున్నట్లుగానే, సమాజంలో కూడా వివిధ కులాలూ, సమూహాలూ, వర్గాలు సమాజం పుట్టుకతోనే ఏర్పడ్డాయి. శరీరంలోని అవయవాల మధ్యన సమన్వయం, ఐక్యత మాత్రమే ఉంటుంది. ఘర్షణ ఉండదు. అలాగే సమాజంలో ఉన్న కులాలు, సమూహాలు, వర్గాల మధ్యన కూడా సమన్వయం, ఐక్యత మాత్రమే వుంటాయి. ఘర్షణ ఉండదు. ఇది సమాజం యొక్క సహజ లక్షణం.

ఈ సహజ లక్షణానికి భిన్నంగా సమాజంలో అప్పుడప్పుడూ అనైక్యత, ఘర్షణలూ పొడ చూపుతుంటాయి. ఈ అనైక్యత, ఘర్షణలకు రెండు కారణాలున్నాయి. అవి:

1. ధర్మం పట్ల సక్రమమైన అవగాహన లోపించటం మూలంగా ప్రజల్లో సత్ ప్రవర్తన కొరవడటం. దీన్ని నివారించటానికి ప్రజల్లో నిరంతరం ధర్మాన్ని గురించిన అవగాహన పెంచుతూ, వారిని చైతన్యవంతులను చేసే కార్యక్రమాలు చేపట్టాలి.

2. మన సమాజానికి బయటివాళ్ళు ముస్లింలు, క్రిస్టియన్‌లు, కమ్యూనిస్టులు. మన సమాజంలో తలెత్తే అనైక్యతకూ, ఘర్షణలకూ వీళ్ళ కుట్రలే ప్రధాన కారణం. ప్రజల్లో సత్ ప్రవర్తన కొరవడి, స్వార్థం ప్రబలినప్పుడు వీళ్ళు దాన్ని ఆసరాగా తీసుకుని ప్రజల మధ్య అనైక్యతా బీజాలు నాటి, విద్వేషాలను రగిలిస్తున్నారు. ప్రలోభాలు చూపించి మన సమాజాన్ని విడగొడుతూ మత మార్పిడులకు ప్రయత్నిస్తున్నారు. ప్రశాంతంగా బ్రతుకుతున్న వివిధ కులాలు, సమూహాలు, వర్గాల మధ్యన చిచ్చు పెడుతున్నారు. కాబట్టి వీళ్ళను మన సమాజం నుండి సమూలంగా తుడిచిపెట్టటానికి తగిన కార్యక్రమాలు రూపొందించుకోవాలి."

ఇదీ స్థూలంగా 'ఏకాత్మతా మానవతా వాదం' యొక్క సారాంశం. సమాజంలో వ్యవస్థాగతంగానే అసమానతలూ, అణచివేత, దోపిడీలూ ఇయనే ఆలోచనకి వీళ్ళ భావజాలంలో చోటు లేదు.

గోల్వాల్కర్ గురూజీ కూడా సమాజం లోని అసమానతలను సమర్థిస్తూ, "ఇల్లు కట్టుకోవాలంటే కింద కొన్ని ఇటుకలు ఉండాలి. పైన కొన్ని ఇటుకలు ఉండాలి. అన్ని ఇటుకలూ పైనే ఉంటానంటే ఇల్లు ఏమవుతుంది?" అని ప్రశ్నించాడు. ఫలితం ఆశించకుండా ఎవరి విధులను (విధులంటే వర్ణాశ్రమ ధర్మాలని వాళ్ళ భావం) వాళ్ళు నిర్వర్తించటమే గొప్ప ధర్మమని, అణచివేత, దోపిడీలకు గురవుతున్న పీడిత ప్రజా సమూహాలన్నింటికీ వీళ్ళు బోధిస్తున్నారు. ఆందోళనలు చెయ్యటం, ఉద్యమాలు చెయ్యటం భారతీయ సంస్కృతికీ, విలువలకూ విరుద్ధమని అంటున్నారు. హిందూ సంస్కృతిని కాపాడుకోవటం కోసం జరిగే ఉద్యమాలు, ఆందోళనలూ తప్ప, మిగిలినవన్నీ అభివృద్ధిని అడ్డగించే జాతివ్యతిరేక కార్యకలాపాలని అంటున్నారు. వాటివెనుక 'బయటివాళ్ళ' కుట్ర ఉందని తమ అంతర్జాతీయ గురువు గారైన గోబెల్స్ తరహా ప్రచారం చేస్తున్నారు.

ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, 1970 వ దశాబ్దం వరకూ వాళ్ళు సామాజిక ఆమోదాన్ని పొందలేక పోయారు. జయప్రకాశ్ నారాయణ్‌తో కలిసి ఇందిరా గాంధీ అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాల్గొనటం మూలంగా ఇతర ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలకు కొంతమేరకు దగ్గర కాగలిగారు. జంధ్యాలు తెంచి వేయండి అని జయప్రకాశ్ నారాయణ ఇచ్చిన పిలుపును మాత్రం సంఘ్ పరివార్‌లో ఏ ఒక్కరూ పట్టించుకోలేదు.

ఎమర్జెన్సీ కాలంలో ఆర్.యస్.యస్., దాని అనుబంధ సంస్థలు కూడా నిషేధానికి గురయ్యాయి. చాలామంది నాయకులు జైళ్ళకు వెళ్ళారు. దానితో వాళ్ళకు సామాజిక గౌరవం, విశ్వసనీయత పెరిగాయి. ఎమర్జెన్సీ అనంతరం తమ స్వంత పార్టీ అయిన భారతీయ జన సంఘ్‌ను రద్దు చేసుకుని జనతా పార్టీలో విలీనమయ్యారు. మురార్జీ దేశాయ్ నాయకత్వంలో ఏర్పడిన కేంద్ర ప్రభుత్వం లో భాగస్వాములయ్యారు. జనతాపార్టీ లో ఉంటూ, ఆర్.యస్.యస్. లో కూడా సభ్యులుగా కొనసాగటం మంచి పద్ధతి కాదని అంటే, జనతా పార్టీనే వదులుకుంటాం కాని ఆర్.యస్.యస్. ను వదులుకోం అని జనతా పార్టీ నుండి విడిపోయారు. బి.జె.పి. పార్టీని 1980 లో స్థాపించారు.

**అధికారం కోసమ్ 'అయోధ్య':**

సమాజంలో హిందూ సంస్కృతిని పెంపొందించి, తద్వారా రాజకీయాలను నియంత్రించటం కంటే, రాజకీయాధికారం సాధించటం ద్వారా హిందూ సంస్కృతిని వ్యాపింప చేయటం చాలా తేలికైన పని అని జనతా ప్రభుత్వం హయాంలో కొద్ది కాలం కేంద్రంలో అధికారం అనుభవించటం ద్వారా ఆర్.యస్.యస్.కు అర్థమైంది. రాజకీయాధికారం సాధించుకోటానికి దగ్గరి దారి ప్రజాకర్షక కార్యక్రమాలని 1980 ల నాటికి ఆర్.యస్.యస్. గ్రహించింది.

జన సంఘ్ కానీ, బి.జె.పి. కానీ మొదటి నుండి కూడా ప్రజలు నిజజీవితంలో ఎదుర్కొనే ప్రధాన సమస్యల మీద ఎప్పుడూ ఆందోళనలు చెయ్యలేదు. వాటి కోసం జనాన్ని సమీకరించలేదు. వాస్తవిక సమస్యల మీద ఆందోళనలు చెయ్యటం ఆర్.యస్.యస్.భావజాలానికి పొసగదు. అందుచేత ప్రజల భావోద్రేకాలను తీవ్రంగా రెచ్చగొట్టగల అంశాల గురించి మేధో మధనం జరిపారు. రామజన్మ భూమి, బాబ్రీ మసీదు సమస్యను ముందుకు తెచ్చారు.

1970వ దశాబ్దం చివరి వరకూ రాజ్యం మీదా, వివిధ ప్రభుత్వ శాఖల మీదా, పౌర సంస్కృతి మీదా విద్యావంతులైన అగ్ర కుల మధ్యతరగతి వర్గాల, ఉన్నత వర్గాల ఆధిపత్యమే దాదాపు నిరాటంకంగా కొనసాగింది. ప్రజాస్వామ్యం కనీసంగా నైనా అమలు కావటం మూలంగా రాజకీయాల్లోనూ, పౌర సంస్కృతి లోనూ 1980 ల నాటికి గుర్తించతగిన మార్పులు చోటు చేసుకున్నాయి. అట్టడుగు కులాలూ, అల్పసంఖ్యాక వర్గాలూ ఎంతో కొంత మేరకు రాజకీయంగా సంఘటితం కాగలిగాయి. తమ ఆకాంక్షలను బలంగా వినిపించ సాగాయి. రిజర్వేషన్ అనుకూల, రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు 1980 లలో దేశాన్ని కుదిపేశాయి. ప్రజాస్వామ్యంలో నాలుగవ స్థంభంగా చెప్పుకునే మీడియాతో సహా మొత్తం సమాజం అగ్ర కులాలూ, అట్టడుగు కులాలుగా చీలిపోయింది. అన్ని రంగాల్లో కొనసాగుతున్న అగ్ర కులాధిపత్యాన్ని అట్టడుగు కులాలు అడుగడుగునా ప్రశ్నించటం ప్రారంభించాయి. తమ ఆధిపత్యం బీటలు వారుతున్నదని అగ్రకులాల్లో ఆందోళన మొదలయింది. ప్రశ్నించటాన్ని అరాచకంగా, క్రమశిక్షణా రాహిత్యంగా అగ్రకులాలు భావించాయి. ఓట్ల కోసం అట్టడుగు కులాలకూ, అల్ప సంఖ్యాక వర్గాలకూ ఇవ్వాల్సిన దాని కంటే ఎక్కువ స్వేచ్ఛ ఇచ్చి, వాళ్ళను సంతృప్తి పరిచే విధానాలను పాలకులు అనుసరిస్తున్నారనే అభిప్రాయం అగ్రకులాల్లో ఏర్పడింది. అనేక సంవత్సరాల నుండి అవే అభిప్రాయాలను ప్రచారం చేస్తున్న బి.జె.పి. పార్టీతో అగ్రకులాలు పూర్తిగా మమేకమవటం ప్రారంభమైంది. భారతీయ సమాజంలో కులాలవారీ చీలిక వస్తే రాజకీయంగా వాళ్ళకు నష్టం జరుగుతుంది కాబట్టి, సంఘ్ పరివార్ మతోన్మాదాన్నే మరింత దూకుడుగా రెచ్చగొట్ట సాగింది.

**రాజీవ్‌గాంధి తప్పిదాలు:**

ప్రజల కోసం తమ పార్టీ చేపట్టిన పథకాల గురించి మాత్రమే చెప్పి ప్రజల ఓట్లను పొందటం సాధ్యం కాదేమోనని రాజీవ్‌గాంధీ ఒక దశలో అభిప్రాయపడ్డారు. షాబానో కేసులో సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న ముస్లిం ఛాందసవాదులను తృప్తిపరిస్తే ముస్లిం ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టవచ్చనే ఉద్దేశంతో షాబానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు కావటానికి వీలులేకుండా చట్టం చేశాడు. తద్వారా మత

ఛాందసవాదులను తృప్తిపరిచి ఓట్లు కొల్లగొట్టే విధానానికి నాంది పలికాడు. గతంలో గాంధీ హయాంలో కూడా కాంగ్రెస్‌లో ఈ ధోరణులు ఉన్నాయి. కానీ రాజీవ్‌గాంధీ ఈ విషయాన్ని సామాన్య ప్రజలకు కూడా అర్థమయేటట్లు చేశాడు.

1931 లో కాన్పూర్‌లో జరిగిన మతకలహాలపై నిజనిర్ధారణ జరపటానికి భారత జాతీయ కాంగ్రెస్ ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ స్వయంగా ఇరుమతాల సామాన్య ప్రజల దగ్గరకు వెళ్ళి విచారించి ఒక నివేదికను రూపొందించి కాంగ్రెస్ పార్టీకి సమర్పించింది. మతం పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలలోని లోపాలను నిర్మొహమాటంగా విమర్శిస్తూ ఆ కమిటీ రిపోర్టులో ఈ విధంగా పేర్కొంది.

"నిజానికి మనం వాస్తవాలను గమనిస్తే, వాటిని సరైన దృక్కోణంలోంచి చూసి ఎలాంటి వెనుకంజ వేయకుండా ఆ వాస్తవాలను దేశప్రజల ముందు పెట్టగలిగితే, మౌలానా మహ్మద్ ఆలీ, ఆయన అన్న, అనేక ముస్లిం నాయకులు, కార్యకర్తలు హిందూ, ముస్లిం ఐక్యత కోసం పాటుబడటమే కాకుండా తమ మతంలోని తిరోగామి శక్తులతో బాహాటంగా పోరాడారని గుర్తిస్తాం. కానీ కాంగ్రెస్‌లోని హిందూ ప్రసిద్ధ నాయకులెవరూ తమ మతంలోని తిరోగామి శక్తులతో బాహాటంగా పోరాడలేదు. కాంగ్రెస్ పార్టీ తన కార్యకర్తలను, తనను అభిమానించే ప్రజలను తిరోగామి శక్తులకు లొంగిపోయేట్లు చేసింది. మతోన్మాదాన్ని మనస్ఫూర్తిగా ఉమ్మడిగా వ్యతిరేకించాలన్న భావన కాంగ్రెస్‌లో క్షీణించింది. దీని మూలంగా మతోన్మాదులు విపరీతంగా పెరిగారు. అన్ని ప్రచార కార్యక్రమాలలో పైచేయి సాధించారు".

మత ఛాందసవాదానికి వ్యతిరేకంగా రాజీవ్‌గాంధీ నిర్ణయాత్మకమైన పోరాటం చేయకుండా వాళ్లకు లొంగిపోయి ఉభయ మత ఛాందసవాదులనూ తృప్తిపరచే విధానం అవలంబించటమే దేశంలో మతోన్మాదం, ముఖ్యంగా హిందూ మతోన్మాదం పెచ్చరిల్లటానికి బాటలు వేసింది.

**సావర్కార్ హిందూత్వ సిద్ధాంతం:**

1986 లో రాజీవ్ గాంధీ హిందువులు పూజలు చేసుకోటానికి వీలుగా వివాదాస్పద బాబ్రీ మసీదు తాళాలు తీయించి, హిందూ ఓటు బ్యాంకును

కొల్లగొట్టటానికి పథకాలు రచించాడు. దాంతో బి.జె.పి. అప్రమత్తమైంది. అప్పటివరకూ ఉన్న కొద్దిపాటి తటపటాయింపును కూడా పక్కన పెట్టింది. తన హిందూ పునాదిని విస్తృతం చేసుకుని, పటిష్టపరుచుకోవాలనే అభిప్రాయానికొచ్చింది. ఈ శతాబ్దపు తొలినాళ్ళలో సావర్కార్ ప్రవచించిన 'హిందూత్వ' సిద్ధాంతాన్ని 1989 లో తమ పార్టీ సిద్ధాంతంగా స్వీకరిస్తూ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసింది.

"పటిష్ట జాతిని నిర్మించాలంటే ఉమ్మడి శత్రువు కావాలి" అనే సిద్ధాంతాన్ని సావర్కార్ బలంగా విశ్వసించాడు. ముస్లింలనూ, క్రిస్టియన్‌లనూ ఈ దేశంలోని మిగతా ప్రజానీకానికంతటికీ ఉమ్మడి శత్రువులుగా చూపెట్టాలనే లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని, దానికి అనుగుణంగా 'హిందూత్వ' సిద్ధాంతాన్ని సృష్టించాడు. అందువల్లనే 'హిందువు' అనే పదానికి అతను మతపరమైన అర్థం ఇవ్వలేదు. జాతి పరమైన అర్థం ఇచ్చాడు. పూర్తిగా అది జాతి పరమైన నిర్వచనం కూడా కాదు. మత భావనలతో అవినాభావ సంబంధం గల జాతి పరమైన నిర్వచనం ఇచ్చాడు. ఆ నిర్వచనం ఇవ్వటానికి పితృభూమి (తాత, తండ్రుల కాలం నుండి పుట్టి పెరిగిన ప్రదేశం), పుణ్యభూమి (పవిత్రంగా భావించే ప్రదేశం) అనే పదాలను ఆసరాగా తెచ్చుకున్నాడు. ఎవరి పితృభూమి, పుణ్యభూములు అఖండ భారత భౌగోళిక సరిహద్దుల మధ్య ఉంటాయో, వారందరూ హిందువులే అని సావర్కార్ నిర్వచించాడు. మరో రకంగా చెప్పాలంటే అఖండ భారతదేశపు భూభాగం వెలుపల ఉన్న ఏ ప్రదేశాన్నయినా పవిత్ర ప్రదేశంగా భావించే వాళ్ళు హిందువులు కారనీ, పరాయి వాళ్ళనీ నిర్వచించాడు. ఈ నిర్వచనం ప్రకారం చార్వాకులూ, లోకాయతులూ, ఈ దేశంలోని కమ్యూనిస్టులూ కూడా హిందువుల కిందికే వస్తారు. ఎందుకంటే ఈ దేశం వెలుపల వాళ్ళకు పవిత్ర ప్రదేశాలు లేవు కాబట్టి. అలాగే బౌద్ధ, జైన, సిక్కు లాంటి హైందవేతర మతస్తులు కూడా హిందువుల కిందకే వస్తారు. ఎందుకంటే వాళ్ళందరి పవిత్ర ప్రదేశాలూ ఈ భూభాగంలోనే ఉన్నాయి కాబట్టి. క్రిస్టియన్లు పవిత్రంగా భావించే జెరూసలేం, ముస్లింలు పవిత్రంగా భావించే మక్కాలు ఈ దేశానికి వెలుపల ఉన్నాయి కాబట్టి వాళ్ళు మాత్రం 'హిందూజాతి' కాదు, 'పరాయి వాళ్ళు' అని సావర్కార్ నిర్వచించాడు. ఈ దేశంలో అత్యంత సంపన్నవంతమైన పార్శీలు కూడా పరాయి వాళ్ళ కిందకే వచ్చినా, వాళ్ళను సావర్కార్ గానీ, సంఘ్ పరివార్ గానీ 'శత్రువులు' గా

పరిగణించరు. దానికి వేరే కారణాలున్నాయి. ముస్లింలు, క్రిస్టియన్లు, పార్శీలు తప్ప ఈ దేశంలో నివసిస్తున్న ప్రజలందరూ హిందూ జాతి అనీ, ఈ దేశం హిందూ దేశమనీ సావర్కార్ సిద్ధాంతీకరించాడు. 'హిందూ జాతి'ని నిర్వచించటానికి భౌగోళిక ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుని, మతాన్ని పక్కన పెట్టాడు. 'పరాయి వాళ్ళ'ను నిర్వచించటానికి మాత్రం మతాన్ని ప్రాతిపదికగా తీసుకుని భౌగోళిక ప్రాంతాన్ని ప్రక్కన పెట్టాడు.

బ్రాహ్మణీయ వైదిక మతంలోని కుల అణచివేతను తట్టుకోలేక, చాలామంది అట్టడుగు కులాల ప్రజలు ఇస్లాం మతాన్నీ, క్రైస్తవ మతాన్నీ స్వచ్ఛందంగా స్వీకరించారు. ప్రస్తుతం ఈ దేశంలోని క్రిస్టియన్లలో 99.9% జనాభా, ముస్లింలలోని 80% జనాభా ఈ దేశ మూలవాసులైన అట్టడుగు కులాలకు చెందిన వాళ్ళేనని చాలామంది చరిత్రకారులు అంగీకరిస్తున్నారు. మతం మారినప్పటికీ, వీళ్ళందరూ సంఘ్ పరివార్ కీర్తిస్తున్న హిందూ సంస్కృతికి ఆయువు పట్టు అయిన కుల అంతరాలను ఇవ్వాల్టికీ తమ రోజువారీ జీవితాల్లో పాటిస్తున్నారు. అది మంచిదని కాదు. అయినప్పటికీ వీళ్ళపై 'పరాయి వాళ్ళు' 'శత్రువులు' అని సంఘ్ పరివార్ ముద్రలు వేస్తున్నది. ఎందుకంటే బలమైన 'ఊహాత్మక శత్రువు' ను సృష్టించుకోలేకపోతే వాళ్ళు ప్రవచిస్తున్న 'హిందూత్వ' సిద్ధాంతం కుప్పకూలిపోతుంది.

1989లో 'హిందూత్వ' ఇక మీదట తమ సిద్ధాంతమని బి.జె.పి. బహిరంగంగా ప్రకటించినప్పటి నుండి దాని నాయకులూ, కార్యకర్తలూ, అప్పటి వరకూ తమ అంతర్గత సమావేశాల్లో మాట్లాడుకునే ముస్లిం వ్యతిరేక విద్వేష భావాలను బహిరంగంగా తీవ్రస్థాయిలో దేశ వ్యాప్తంగా ప్రచారం చేయటం మొదలుపెట్టారు. రామ్ రథ యాత్రలు చేశారు. బాబ్రీ మసీదును కూల్చారు. ఓట్లు, తద్వారా పార్లమెంట్‌లో సీట్లు పెంచుకున్నారు.

బాబ్రీ మసీదు కూల్చివేతకు ముందు చాలా కాలం నుండీ రామజన్మ భూమి సేవాసమితి పేరుతో లాల్‌దాస్ అనే ఆయన అయోధ్యలోని హిందూ ముస్లింల సామరస్యం కోసం కృషి చేస్తున్నారు. 1983లో అయోధ్యలోని రామజన్మభూమి ఆలయానికి ప్రధాన అర్చకుడిగా లాల్‌దాస్‌ను కోర్టు నియమించింది. బాబ్రీ మసీదు అంశం మీద అద్వానీ రథయాత్రను నిలుపుదల చేయాలని లాల్‌దాస్ బహిరంగంగా

డిమాండ్ చేశాడు. ఇతరుల మత భావనలను నొప్పించటం, వారి హృదయాలను గాయపరచటం ఎవరూ ఎప్పుడూ చెయ్యకూడదని, అలా చెయ్యటానికి మన మతం అనుమతించదని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించటమే శ్రీరాముడి యొక్క రాజకీయ ఆదర్శమని, ప్రజలంతా తమ సొంత మనుషులే అనీ, ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదనీ లాల్‌దాస్ తన అభిప్రాయాలను ఇంటర్వ్యూల ద్వారా చాటిచెప్పాడు. బాబ్రీమసీదు కేంద్రంగా విశ్వహిందూపరిషత్ చేపట్టిన ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు.

అయోధ్య, ఫైజాబాద్ వెలుపల ఉన్న వాళ్లు రామజన్మభూమి, బాబ్రీ మసీదు విషయాన్ని రాజకీయం చేయొద్దని విజ్ఞప్తి చేశాడు. అయోధ్య, ఫైజాబాదుల్లోని హిందూ ముస్లింలు తమలో తాము చర్చించుకొని రామజన్మభూమి విషయాన్ని పరిష్కరించుకోగలరని, దానిలో బయట వాళ్ల జోక్యం అవసరం లేదనీ స్పష్టం చేశాడు. అయోధ్యలో సుమారు 50, 60 మంది మహంతులు హత్యకు గురయ్యారని, తనలాంటివాడు ఇంకా బతికి ఉండటం తనకే ఆశ్చర్యంగా ఉందని, 1992లో మధు కిష్వర్‌కిచ్చిన ఇంటర్వ్యూలో లాల్‌దాస్ పేర్కొన్నారు.

రామజన్మభూమి బాబ్రీమసీదు సమస్యను శాంతియుతంగా పరిష్కరించటానికి ఆయన చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. 1992 మార్చి 1న కల్యాణ్‌సింగ్ ప్రభుత్వం లాల్‌దాస్‌ను రామజన్మభూమి పూజారి పదవినుండి తొలగించింది. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదును కూల్చివేసిన తరువాత లాల్‌దాస్ ప్రాణాలకు హాని జరిగే అవకాశం మరింతగా పెరిగింది. తనకు రక్షణ కల్పించమని ఫైజాబాద్ జిల్లా యంత్రాంగానికి లాల్‌దాస్ మొరపెట్టుకున్నాడు. అతని మొరను ఎవరూ ఆలకించలేదు. 1993 నవంబర్ 16న లాల్‌దాస్‌ను పాశవికంగా కాల్చి చంపారు.

అభ్యుదయ లౌకిక వాద శక్తులు మతానికి వెలుపల ఉండి మతోన్మాదాన్ని విమర్శిస్తున్నాయి. వీళ్లు మతాన్ని మొత్తంగా వ్యతిరేకిస్తూ ఉండటం మూలంగా మతాన్ని అనుసరించే సామాన్య ప్రజలు వీళ్ల మాటల్ని పట్టించుకోవటం లేదు. కానీ గాంధీ, లాల్‌దాస్‌లు హిందూ మతస్థులుగా ఉంటూనే హిందు మతోన్మాదాన్ని వ్యతిరేకించినందుకు హత్య గావించబడ్డారు. మత విశ్వాసం గల సామాన్య ప్రజలు గాంధీ, లాల్‌దాస్ లాంటి వాళ్ల మాటలకే ఎక్కువ విలువ ఇస్తారు.

హిందూ మతోన్మాదాన్ని ఎదుర్కొవాలంటే నైతిక విలువల ఆధారంగా మతాన్ని మానవీకరించే కృషిలో దేశవ్యాప్తంగా నిమగ్నమైన వ్యక్తులనూ, శక్తులనూ గుర్తించి వాళ్ల కృషిని పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

వర్ణాశ్రమ ధర్మాన్ని, కుల వ్యవస్థను వ్యతిరేకించే మతాలు, మత శాఖల సమ్మేళనాలను వైదికేతర ధర్మ సంసద్ పేరుతో పెద్ద ఎత్తున నిర్వహించాల్సిన అవసరం ఉంది.

మతాన్ని మత్తుమందుగా భావించి కమ్యూనిస్టులు దానికి దూరంగా ఉన్నారు. మతాన్ని మానవీకరించే కృషిని గాంధి హత్యానంతరం భారతదేశంలో ఏ రాజకీయ నాయకుడూ చేపట్టలేదు. మత పరమైన విషయాలను సంఘపరివార్ ఇష్టారాజ్యానికి వదిలి వేశారు. సంఘ్‌పరివార్ ఇంతగా బలపడటానికి, బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రధానకారణాలలో ఇది ఒకటి. ఈ లోపాన్ని సవరించుకొని అభ్యుదయ లౌకిక వాద శక్తులు మతాన్ని మానవీకరించే కృషిని తమ రాజకీయ కార్యాచరణలో భాగంగా చేసుకోకపోతే ఈ దేశంలో సంఘ్‌పరివార్‌ను నిలవరించటం చాలా కష్టసాధ్యమవుతుంది.

సర్వేజనా సుఖినోభవంతు, వసుధైక కుటుంబం, ఉన్నది ఒక్కటే – విజ్ఞులు దానిని వేరువేరు పేర్లతో పిలుస్తారు. సర్వధర్మ సమభావన, "సృష్టితత్వం ఎవడెరుగును? దాన్ని ఎవరు వర్ణించగలరు? ఏ కారణంతో సృష్టి జరిగింది? సృష్టిని దేవతలు సృష్టించారా? సృష్టి తరవాతనే దేవతలు అవతరించారా? ఎవరికి తెలుసు? ఈ సృష్టిని చేసిందెవరు? చెయ్యనిదెవరు? దేవతలకైనా తెలుసునా? వారికి కూడా తెలియదా? అది అంతా అనిశ్చితము. అనిశ్చితము నిశ్చితము ఎల్లుగును. అనిశ్చితముగానే ఉండును. ఇదిసత్యము" (రుగ్వేదంలోని నాసదీయ సూక్తంలో కొంత భాగం)

ఇలాంటి మానవీయ విలువలే హిందూ మతం యొక్క అసలైన ధర్మాలని గాంధీ, లాల్‌దాస్ వంటి వాళ్లు నమ్మారు. మధ్యయుగాల్లోని భక్తికవులు అదే నమ్మి ప్రచారం చేశారు. అసంఖ్యాకమైన సామాన్య హిందూ ప్రజానీకం కూడా ఆ విలువలను అంగీకరిస్తారు. ఈ విలువలకు భిన్నంగా పరమత ద్వేషం, హంతక దాడులు, సామూహిక హత్యాకాండలు లాంటి అమానవీయ చర్యలు హిందూ పౌరుషానికి ప్రతీకలని ఆ చర్యల్లో పాలుపంచుకోవటమే దేశభక్తి అనీ, జాతీయవాదం అనీ

సంఘపరివార్ శక్తులు నిరంతరం ప్రచారం చేస్తున్నాయి. నిజమైన హిందూ విలువలకు సంఘ్‌పరివార్ ప్రవచించే 'హిందూత్వ' కూ ఏ మాత్రం సంబంధం లేదు.

మతం పేరుతో హిందూధర్మాన్ని హిందుమతంలోని నైతిక విలువలను ధ్వంసం చేస్తూ హిందూ మతానికి తీవ్రమైన కళంకాన్ని సంఘ్‌పరివార్ శక్తులు కలిగిస్తున్నారు. హిందూ మతానికి వీళ్లు చేసినంత అపకారం చరిత్రలో ఇంతవరకు ఎవరూ చేయలేదు. భారతదేశం ఆర్థిక స్వావలంబన సాధించాలి అనే జాతీయోద్యమ లక్ష్యానికి కూడా కాంగ్రెస్ కంటే బి.జె.పి.యే ఎక్కువ తూట్లు పొడిచింది.

1998 నుండి 2004 వరకూ వాజ్‌పాయ్ సారధ్యంలోని బి.జె.పి. సంకీర్ణ ప్రభుత్వం ఈ దేశాన్ని పరిపాలించింది. పి.వి. నరసింహారావు హయాంలో కాంగ్రెస్ చేపట్టిన నూతన ఆర్థిక విధానాలను సంపూర్ణంగా అమలు చేసింది. ప్రభుత్వరంగ పరిశ్రమల్లో పెట్టుబడుల ఉపసంహరణకు ఏకంగా ఓ మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేసింది. బహుళ జాతి కంపెనీలకూ, కార్పొరేట్ శక్తులకూ సేవలు అందించటంలో తనను మించిన రాజకీయ పార్టీ ఈ దేశంలో లేదని నిరూపించుకుంది. సంకీర్ణ రాజకీయాల్లో ఉన్న అనివార్యతల రీత్యా తన మతోన్మాద కార్యక్రమాలను కొంత మేరకు తగ్గించుకుంది. అభివృద్ధి ఎజెండాను ముఖ్యాంశంగా పెట్టుకుని, ఇండియా వెలిగిపోతోంది అనే నినాదంతో 2004 ఎన్నికలను ఎదుర్కొంది. పరాజయం చవి చూసింది.

సామాన్య ప్రజల సంక్షేమాన్ని బలిపెట్టి కార్పొరేట్ ప్రపంచ అనుకూల విధానాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వటం, వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేసి, ఆ రంగంలో తీవ్ర సంక్షోభానికి దారితీసిన విధానాలను అనుసరించటం అనేవి బి.జె.పి. ఓటమికి దారి తీసిన ప్రధాన కారణాలని విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు. కాని హిందూత్వ విధానాలను పక్కన పెట్టటం వలన బి.జె.పి. ఓటమి పాలైందని ఆర్.యస్.యస్. అభిప్రాయపడింది. బి.జె.పి. నాయకులు హిందూత్వ సిద్ధాంతానికి కట్టుబడకుండా, అధికారంలో కొనసాగటానికి అవకాశవాద రాజీలు పడ్డారని ఆర్.యస్.యస్. భావించింది. 2005 ఏప్రిల్‌లో అప్పటి ఆర్.యస్.యస్. సర్ సంఘ్ చాలక్ అయిన కె. సుదర్శన్ ఓ ఇంటర్వ్యూలో 'వాజ్‌పాయ్, అద్వానీలు పక్కకు తప్పుకుని బి.జె.పి.లో కొత్తవాళ్ళకు చోటు కల్పించాలని" చెప్పాడు.

**మోదీకి పట్టం:**

2002 గుజరాత్ మారణకాండ సమయంలోనూ, ఆ తర్వాత కాలంలోనూ మోదీ వ్యవహారశైలి ఆర్.యస్.యస్ ను అమితంగా ఆకట్టుకుంది. ప్రజాస్వామ్య చట్రంలోనే నియంత తరహా పాలన సాగించగల మోదీని, హిందూమత సంరక్షణ కోసం ఎంతటి మారణహోమాన్నైనా జరిపించటానికి వెనుకాడని వీరుడిగా ఆర్.యస్.యస్. గుర్తించింది. మోదీని ప్రధానమంత్రి అభ్యర్థిగా రంగంలోకి దించటానికి 2005 నుండి పావులు కదిపింది. మోదీకి అనధికారికంగా 'హిందూ హృదయ సామ్రాట్' అనే బిరుదును ఇచ్చింది. ఫలితంగా మోదీ 2014 లో ఈ దేశ ప్రధాని అయ్యాడు. అద్వానీ తెరమరుగయ్యాడు.

**పెట్టుబడి ఆలోచనలతో మార్పు:**

ఈమధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానంలో చాలా మార్పులొచ్చాయి. గత రెండు దశాబ్దాల్లో ఆ మార్పులు మరింత వేగవంతమయ్యాయి. ఉత్పాదక పెట్టుబడి కుంచించుకుపోయింది. ద్రవ్యపెట్టుబడి రంగంలోకి వచ్చింది. అది ఉత్పాదక రంగం నుంచి సేవారంగంలోకి ప్రవహించింది. ఉత్పత్తి ప్రక్రియను ముక్కలు ముక్కలు చేసి ప్రపంచం నలుమూలలకూ విసిరేసింది. సంఘటిత కార్మిక రంగాన్ని చెల్లాచెదురు చేసింది. అసంఘటిత రంగ కార్మికులను పెంచింది. కార్మికోద్యమాల పునాదిని, కార్మికోద్యమ పార్టీల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించింది. తనను భయపెట్టే స్థాయిలో కార్మికోద్యమాలు తలెత్తలేని పరిస్థితిని పెట్టుబడి సృష్టించుకోగలిగింది. అయినప్పటికీ పెట్టుబడి తన ప్రయాణాన్ని సాఫీగా కొనసాగించ లేకపోతోంది.

పెట్టుబడి సాగిస్తున్న ఉమ్మడి వనరుల దోపిడీకీ, కాలుష్యానికీ వ్యతిరేకంగా ఎక్కడికక్కడ మిలిటెంట్ పోరాటాలు దేశవ్యాప్తంగా తలెత్తుతున్నాయి. అయితే ఈ పోరాటాలకు దీర్ఘకాలిక లక్ష్యం లేదు. ఎవరికి వారు చేస్తున్న విడివిడి పోరాటాలు తప్ప వీటి మధ్య దేశవ్యాప్త సమన్వయం కూడా లేదు.

కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా తలెత్తుతున్న ఈ విడి విడి పోరాటాలను హింసాత్మకంగా అణచివేస్తే ప్రజల్లో మరింత వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రజలు అలాంటి పోరాటం వైపు వెళ్లకుండా వాళ్లని

పక్కదారి పట్టించగల భావజాలం బహుళజాతి సంస్థలకూ, కార్పొరేట్ శక్తులకూ అవసరం సంఘ్‌పరివార్ తీసుకొస్తున్న మత జాతీయవాదాన్ని కార్పొరేట్ శక్తులు కూడా బలపరుస్తున్నాయి. కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను కాంగ్రెస్ కంటే దూకుడుగా మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్నది. బహుళజాతి సంస్థలకు వ్యతిరేకంగా పోరాడేందుకే స్థాపించిన 'స్వదేశీ జాగరణ మంచ్' ని సంఘ్‌పరివార్ నిస్సిగ్గుగా అటక ఎక్కించింది.

ఒకప్పుడు సమాజ గమనాన్ని ప్రభావితం చేసిన సామాజిక బాధ్యత, సమ సమాజ స్థాపన అనే భావనలు వెనకదారి పట్టాయి. మధ్యతరగతి వర్గం శక్తివంతమైనదిగా ఎదిగి పెట్టుబడిదారీ వర్గ ఆకాంక్షలనే తన ఆకాంక్షలుగా ప్రకటిస్తోంది.

అలా అని పెట్టుబడిదారీ వర్గానికి నూతన సవాళ్లు రాలేదని కాదు. పెట్టుబడి గ్లోబల్ స్థాయికి విస్తరించటం వల్ల ప్రతిచోటా అది తీవ్రమైన పోటీని, నిరంతర అభద్రతనీ ఎదుర్కొంటోంది. అప్పటిదాకా అమలులో ఉన్న సుస్థిర (సాపేక్షంగా) ఆర్థిక విధానాలను విఛిన్నం చేయటం వల్ల అనేక మంది ప్రజలు అభద్రతా వలయంలో చిక్కుకున్నారు. వాళ్ళు ఇవ్వాళ నిస్సహాయంగా అచేతనంగా ఉండి ఉండొచ్చుగానీ, భవిష్యత్తులో కూడా అలాగే లొంగి ఉంటారనే గ్యారంటీ లేదు.

**'హిందూత్వ'కు పెరిగిన మధ్య తరగతి మద్దతు:**

ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన సాంకేతిక విప్లవం మన దేశంలో నూతన ఆర్థిక విధానాల అమలు ఫలితంగా అన్ని రంగాల్లోకి ప్రవేశించింది. కంప్యూటర్లు వచ్చి టైపు రైటర్లను తుడిచి పెట్టినట్లుగా, పాత టెక్నాలజీ స్థానంలోకి సరి కొత్తవి వచ్చాయి. కొత్త టెక్నాలజీలలో ప్రావీణ్యం సంపాదించిన వాళ్ళకు అధిక వేతనాలతో కూడిన ఉద్యోగావకాశాలు వచ్చాయి. దాని వల్ల సాంప్రదాయ మధ్యతరగతి వర్గానికి భిన్నమైన నూతన మధ్య తరగతి వర్గం ఏర్పడింది. ఈ నూతనవర్గం కూడా ఉన్నత వర్గాల జీవనశైలినే అనుసరించసాగింది.

ఇతర దేశాల మార్కెట్లను కొల్లగొట్టగలిగే ప్రపంచ శక్తిగా భారత దేశం ఎంత త్వరగా ఎదిగితే, అంత త్వరగా తమ సంపద కూడా పెరుగుతుందని ఈ

నయా మధ్య తరగతి వర్గం అనుకుంటున్నది. ప్రజాస్వామ్యం మరీ ఎక్కువగా ఉండి, క్రమశిక్షణ తక్కువ కావటం మూలంగా భారతదేశం ఆశించినంత త్వరగా ఎదగటంలేదని ఈ వర్గం భావిస్తున్నది. నియంతృత్వం ద్వారా సాధించిన క్రమశిక్షణ వలనే చైనా అద్భుతంగా పురోగమించగలిగిందని వీళ్ళు నమ్ముతున్నారు. చైనా తరహా ఉక్కు క్రమశిక్షణను ఈ దేశంలో నెలనొల్పటం హిందూత్వ శక్తులకు మాత్రమే సాధ్యమని వీళ్ళ అభిప్రాయం. రాజకీయ నియంతృత్వం ద్వారా చైనా సాధించిన ప్రగతిని, హిందూ సాంస్కృతిక నియంతృత్వం ద్వారా ఈ దేశంలో కూడా సాధించగలమని వీళ్ళు విశ్వసిస్తున్నారు. మన్మోహన్ సింగ్ లాంటి 'మెతక' నాయకులు కాకుండా మోదీ లాంటి 'ధృఢమైన' నాయకులు కావాలని కోరుకుంటున్నారు. అందుచేతనే ఈ నూతన మధ్యతరగతి వర్గం సంఘ్ పరివార్ కంటే ఎక్కువగా హిందూత్వను సమర్థిస్తున్నారు. సంఘ్ పరివార్ కూడా ఈ వర్గానికి చెందిన ప్రవాస భారతీయులను భావి భారత నిర్మాతలుగా కీర్తిస్తున్నది. మిగిలిన యువతరమంతా వీళ్ళని ఆదర్శంగా తీసుకోవాలని ప్రచారం చేస్తున్నది. సాంప్రదాయ మధ్యతరగతి వర్గం కూడా ఈ ప్రవాస భారతీయుల విజయ గాథలనే స్మరించుకుంటూ, వాళ్ళ లాగానే ఎదగాలని ఉవ్విళ్ళూరుతున్నది. వాళ్ళ బాటలోనే వీళ్ళు కూడా హిందూత్వ మద్దతుదారులుగా తయారయ్యారు. నూతన ఆర్థిక విధానాలు హిందూత్వ శక్తులు ఈ రెండింటి కలయికే ఈ దేశాన్నీ, తమ జీవితాలనూ ఉద్ధరించగలదని కొత్త, పాత మధ్యతరగతి వర్గాలు బలంగా నమ్ముతున్నాయి. ప్రగతిశీల భావాలతో ఈ జాతికి వెన్నెముకగా పేరొందిన మధ్యతరగతి వర్గం ప్రస్తుతం స్వేచ్ఛా విపణిని దేవుడిగా ఆరాధిస్తున్నది. ఆ మార్కెట్ దేవుడికి ప్రధాన పూజారులైన హిందూత్వ శక్తులను బలంగా సమర్థిస్తున్నది.

పాలగుమ్మి సాయినాథ్ చెప్పినట్లుగా ఈ దేశంలో ప్రస్తుతం మత మౌఢ్యం, మార్కెట్ మౌఢ్యం రెండూ కలిసి కార్పొరేట్ మీడియా అనే పక్క మీద సుఖసంసారం చేస్తున్నాయి. వీటి కలయిక ముస్లింలకే కాకుండా ఈ దేశంలోని పీడిత ప్రజలందరికీ అత్యంత ప్రమాదకరం.

ఈ ప్రమాదాన్ని నివారించటానికి తాము చేయగలిగినంతా చెయ్యటమే ప్రజాస్వామికవాదుల ముందున్న తక్షణ కర్తవ్యం. రాబోయే 2019 ఎన్నికల్లో

అభివృద్ధిని చూపించి ఓట్లు అడగగలిగిన పరిస్థితి బి.జె.పి.కీ, సంఘ్‌పరివార్‌కీ లేదు. కాబట్టి పొరుగు దేశంతో యుద్ధవాతావరణం సృష్టించో, లేదా దేశవ్యాప్తంగా మత కల్లోలాలు రగిలించో ప్రజల భావోద్వేగాలు రెచ్చగొట్టి ఓట్లు దండుకొనే ప్రయత్నాలు సంఘపరివార్, బిజెపిలు చేయొచ్చు.

**అడ్డుకోవడమే పరిష్కారం:**

బి.జె.పి. మరోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోలేకపోతే ఈ దేశం హిందూ తాలిబాన్ల రాజ్యంగా మారే ప్రమాదముంది.

ఈ సందర్భంలో సంఘ్‌పరివార్ గురించి బాలగోపాల్ చెప్పిన మాటలు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

"ఎన్నికల్లో ఎవరు గెలిచినా ఒకటే కావచ్చు. కానీ కొంతమంది ఓడిపోవటం మాత్రం సమాజక్షేమానికి అవసరం. కాంగ్రెస్ వాళ్లలాగా ఐదు సంవత్సరాల పాలనలో సంఘ్ పరివార్ పాలకులు డబ్బులు తిని ఊరుకోక తాము కోరుకునే మార్గంలో సమాజాన్ని తయారు చెయ్యటానికి అధికారాన్ని వినియోగించుకుంటారు. దుర్వినియోగం చేస్తారు కూడా. కాంగ్రెస్, తెలుగుదేశంల పాలన తర్వాత ఆ పార్టీల ప్రాపంచిక దృక్పథం (అటువంటిదేమైనా వుంటే) సమాజంలో పెరగదు. మనుషుల మెదళ్లు ఐదేళ్ల తర్వాత కూడా ఎట్లున్నవి అట్లే ఉంటాయి.

సంఘ్‌పరివార్ పాలన అటువంటిది కాదు. ఐదేళ్ల పాలన తర్వాత వారి విషం మరికొన్ని వేల మెదళ్లలోకి ఎక్కి ఉంటుంది. మనుషుల ఆలోచనలు మరికొంత వికృతంగా తయారయి ఉంటాయి. వాళ్ల నిజమైన అజెండా అదే. నెమ్మదిగా నరనరానా దేశ ప్రజల్లో గోల్వాల్కర్ విషాన్ని ఎక్కించటం వారి అసలు అజెండా.

సంఘ్‌పరివార్ రాజకీయాలను లౌకిక వాదం అనే అమూర్తమైన విలువతో ప్రతిఘటించటం కన్నా, మైనారిటీలకు ప్రమాదకరం అనే నినాదంతో ఎదుర్కోవటం కన్నా హైందవ సమాజంగా గుర్తించబడే సమాజంలోని దళిత బహుజన మెజార్టీ ప్రజకు అవి శత్రువులని గుర్తించి ప్రతిఘటించినప్పుడే దాన్ని నిలువరించటం సాధ్యం– అన్న ప్రాథమిక రాజకీయ సత్యాన్ని లోగడ ఉత్తరప్రదేశ్, బీహార్‌లు నేర్పాయి.

అవి దేశంలో అన్ని చోట్లా మాయావతీ ములాయం సింగ్–లాలూయాదవ్‌ల నమూనాలోనే ఉండాల్సిన అవసరం లేదు. అయితే నమూనా ఏదయినా రేపటి రాజకీయాల్లో ఈ ఎరుక ఒక ప్రధాన అంశం కావాల్సి ఉంది.